




కోడూరు తోపు వద్ద పొగమంచుతో కప్పుకుపోయిన 44వ జాతీయ రహదారి

వసూళ్ల పోలీసమ్మ..!



స్టేషన్‌లోనే పంచాయితీలు, దందాలు



మేడం ఆదేశాలను అమలు చేస్తున్న ఓ హెడ్, నలుగురు కానిస్టేబుళ్లు

దళారీగా ఓ నాయకుడు

అక్రమ వసూళ్లతో శాఖకు మచ్చతెస్తున్న వైనం

స్టేషన్‌కు వెళ్లాలంటేనే జంకుతున్న జనం

పుట్టపర్తి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): ఆ మహిళా పోలీసు అధికారి పేరు చెప్పగానే జనం బెంబేలెత్తుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లాలంటేనే జంకుతున్నారు. జిల్లా కేంద్రం సమీపంలో పనిచేస్తున్న ఓ మహిళా పోలీసు అధికారి వసూళ్లే పరమావధిగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇసుక, మట్టి అక్రమ రవాణాదారులు, మట్కా, పేకాట, మద్యం దుకాణదారుల నుంచి నెలవారీ మామూళ్లు గుంజుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా పోలీసు స్టేషన్‌నే పంచాయితీలు, దందాలకు అడ్డాగా మార్చుకున్నారన్న చర్చ ఆ శాఖలో సాగుతోంది. ఫిర్యాదు అందితే చాలు.. బెదిరించి డబ్బు గుంజుతున్నారని బాధితులు వాపోతున్నారు. విచిత్రమేమిటంటే ఫిర్యాదు చేయకపోయినా.. మేడం కల్పించుకుంటున్నారట. తాము ఫిర్యాదు చేయమని బాధితులే చెబుతున్నా.. అంతా మీ ఇష్టమేనా.. అంటూ మేడం వేధిస్తున్నట్లు సమాచారం. కాసులిస్తారా.. కేసు కట్టాలా.. అంటూ బేరాలకు దిగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఆ పోలీసు అధికారి తీరుతో జనం విస్తుపోతున్నారు. ఫిర్యాదు వద్దంటున్నా.. వేధించడం ఏమిటని వాపోతున్నారు. బాధితులు, బాధ్యులు ఇరువర్గాల వారు మేడంకి కాసులు ఇచ్చుకోవాల్సిందేనట. ఆమె పోలీసు స్టేషన్‌లోనే పనిచేస్తున్న ఓ హెడ్ కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్ల ద్వారా దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

నాకింత.. నీకింత..

ఆ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న హెడ్, నలుగురు కానిస్టేబుళ్ల వసూలు చేసిన సొమ్ములో మేడం వాటా పుచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. వైన్స్‌షాపులు, పేకాట, మట్కా నిర్వహించే వారి నుంచి నెలవారీ వసూలు చేస్తున్న డబ్బులో కూడా వాటాలు వేసుకుంటున్నట్లు ఆ శాఖలో చర్చ సాగుతోంది. ఇటీవల స్టేషన్ ఖర్చులంటూ ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుల నుంచి రూ.20వేలు ఆ సిబ్బంది వసూలు చేసినట్లు బాధితుల ద్వారా తెలుస్తోంది.

నాయకుడే దళారీ..

ఓ పార్టీ నాయకుడితో పోలీసమ్మ జత కట్టి పంచాయితీలు, దందాలు సాగిస్తూ లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు సమాచారం. బాధితులే ఫిర్యాదు చేయమంటున్నా మేడం మాత్రం వినరట. కాసులు ముట్టజెప్పకుంటే కేసు కడతానంటూ బెదిరించడం పరిపాటిగా మారిందని సమాచారం. మధ్యలో ఆ నాయకుడు ఎంటరై, పంచాయితీని చక్కదిద్ది, మేడంకి కాసులు చేరుస్తాడన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాదారులు, పేకాట, మట్కా నిర్వాహకుల నుంచి రూ.లక్షల్లో ప్రతినెలా మామూళ్లు వసూలు చేస్తున్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దందా సాగిస్తున్నారిలా..



- ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటే.. ఆ కేసుతో సంబంధమున్న వ్యక్తిని తప్పించడానికి రూ.లక్ష తీసుకున్నట్లు సమాచారం.
- ఎద్దుల బండిని సిమెంటు లారీ ఢీకొన్న ప్రమాదంలో లారీ యజమాని నుంచి రూ.40వేలు కానిస్టేబుల్ గుంజినట్లు తెలుస్తోంది.
- ఓ ఉద్యోగి, ఓ రిటైర్డ్ ఉద్యోగి వాహనాలు ఢీకొన్నాయి. వారిరువురు రాజీ పడ్డారు. రాజీ అయితే తనకేంటి అంటూ ఉద్యోగి నుంచి ఆ పోలీసమ్మ రూ.50వేలు ముక్కుపిండి వసూలు చేశారు.
- ఓ చోరీ కేసులో బాధితుల నుంచి కానిస్టేబుల్ రూ.5వేలు వసూలు చేశాడు.
- ఓ బట్టీ వద్ద ఓ వ్యక్తిని హత్య చేశారు. బట్టీ యజమానికి ఎలాంటి సంబంధం లేకున్నా.. రూ.50వేలు గుంజారని సమాచారం. హత్యకు ఉపయోగించిన మందును ఓ షాపులో కొనుగోలు చేశారని సమాచారం. హత్యతో ఎలాంటి సంబంధం లేకున్నా ఆ షాపు యజమానిని రూ.లక్ష ఇస్తారా, కేసు పెట్టాలా అంటూ బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. చివరకు చేసేదిలేక రూ.80 వేలు ఇచ్చుకున్నాడని తెలుస్తోంది.
- మట్కా నిర్వహిస్తున్నారంటూ రూ.లక్ష డిమాండ్ చేశారట. రూ.75వేలు వసూళ్లు చేసినట్లు సమాచారం.
- టెంకాయలు అమ్ముకుని బతికేవారినీ వదల్లేదు. పోలీసమ్మకు జబ్బు చేసిందనీ, కొబ్బరి బోండాలు ఇవ్వాలని సిబ్బంది హుకుం జారీ చేశారు. డబ్బులిస్తేనే బోండాలు ఇస్తానంటూ దుకాణదారుడు చెప్పాడు. విషయం మేడంకి తెలియడంతో తీవ్ర ఆగ్రహం చెంది దుకాణదారుడిని బండ బూతులు తిట్టారని సమాచారం. పబ్లిక్ స్థలంలో దుకాణం ఎలా పెడతావ్, తీసెయ్యాలనీ, కేసు పెడతా అనడంతో రూ.5వేలు ఆ దుకాణాదారుడు ఇచ్చుకోవాల్సి వచ్చిందట.

ఇలా.. కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనీ, పేకాట ఆడుతున్నారనీ, మట్కా నిర్వహిస్తున్నారని బెదిరిస్తూ నిత్యం వసూళ్లకు పాల్పడుతున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

మంచు దుప్పటి



పంట పొలాన్ని కమ్మేసిన పొగమంచు

ఇటీవల కురిసిన వర్షాలకు ఎండలు తగ్గి, చలి పెరిగింది. రాత్రిళ్లు చలి విపరీతంగా ఉంటోంది. తెల్లవారుజాము నుంచి పొగమంచు కురుస్తోంది. రోడ్లపై వాహనాలు కూడా కనిపించట్లేదు. ఉదయమైనా పొగమంచు వీడట్లేదు. అంతటా మంచు దుప్పటి కప్పేస్తోంది. కర్ణాటక సరిహద్దుగా చిలమత్తూరు మండలం ఉండటంతో ఈ ప్రాంతంలో ఈ పరిస్థితి మరింత ఎక్కువగా ఉంటోంది. రాత్రి 9 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. ఉదయం 8 గంటలు దాటినా చలి తగ్గడం లేదు. మండలం మీదుగా వెళ్లే 44వ, 544-ఈ జాతీయ రహదారులు పూర్తిగా పొగమంచుతో నిండిపోతున్నాయి. ముందు వెళ్తున్న వాహనాలను గుర్తించడం వెనుక వెళ్లే వాహన డ్రైవర్లకు కష్టంగా మారింది.

- చిలమత్తూరు, ఆంధ్రజ్యోతి

అయ్యో.. పిచ్చితల్లీ..!



పేగు తెంచుకుని..
జన్మనిచ్చావు..
నీళ్లు తాగి..
పాలు పట్టావు..
పస్తులుండి..
పొట్ట నింపావు..
ప్రాణంగా
చూసుకున్నావు..
జీవితాన్నే
ధారబోసి..
పెంచావు.. పెద్ద
చేశావు..
నీకంటే మిన్నగా..
బిడ్డనే
ప్రేమించావు..

అదే బిడ్డ.. ఇప్పుడే వస్తానని చెప్పి.. రాత్రి.. ఊరుగాని
ఊరిలో.. వదిలేసిపోతే..వస్తాడని చూశావు.. తప్ప..
వదిలించుకున్నాడని నమ్మలేకపోయావు.. ఊరంతా
అడుగుతున్నారు.. నిన్ను వదిలించుకున్న నీ కొడుకెవరని?
కన్న బిడ్డే మోసగించాడని తెలిసి.. తల్లి గుండె
తల్లడిల్లుతోంది.. పగిలి.. కన్నీరై ఉబికొస్తోంది.. అయినా..
బిడ్డ పేరు మాత్రం చెప్పదు.. ఏం.. ఏమమ్మా..
కొడుకు పేరు తెలీదా.. అయ్యో.. పిచ్చితల్లీ..
ఇంత మోసం చేసినా.. బిడ్డ మీద ఇంకా ప్రేమేనా..
కొడుకుకు ఏమౌతుందోనని దిగులేనా.. అమ్మా..
ఇంత పిచ్చిప్రేమ ఎందుకమ్మా..నీది కాదు.. నిర్భాగ్యం..
నీ ప్రేమను వద్దనుకున్న నీ బిడ్డది..


అమ్మ ప్రేమను పొందలేకపోవడానికి మించిన దౌర్భాగ్యం లేదు.. ఉండదు..



వృద్ధురాలిని ఓల్డేజీహోమ్ వారికి అప్పగిస్తున్న ఎస్ఐ రమేష్

సోమందేపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి.. కని పెంచిన తల్లి ఓ కుమారుడికి భారమైంది. అమ్మను వదిలించుకున్నాడు. మండలకేంద్రానికి శనివారం రాత్రి తీసుకొచ్చి, వదిలి వెళ్లిపోయాడు. మండలకేంద్రంలోని పెద్దమ్మ గుడివద్ద ఆర్టీసీ బస్సులో వృద్ధురాలిని కొడుకు, కోడలు తీసుకొచ్చారు. అక్కడున్న దుకాణాల వద్ద ఆమెను దించి, లగేజీని పక్కన ఉంచారు. ఇప్పుడే వస్తామనీ, ఇక్కడే ఉండమని చెప్పి బస్సు ఎక్కి వెళ్లిపోయారు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. రాత్రయింది. అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. బజారు ఖాళీ అయింది. బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉన్న వృద్ధురాలిని చూసిన అటుగా వెళ్లే వ్యక్తులు దగ్గరకెళ్లి విచారించారు. తన కొడుకు, కోడలు వస్తారనీ, అందుకే ఇక్కడున్నానని ఆ వృద్ధురాలు బదులిచ్చింది. విషయం ఆరాతీస్తే తనది బుక్కపట్నమని చెప్పింది. కొడుకు, కోడలు తనను వదిలేసి వెళ్లారని ఆ వృద్ధురాలు గుర్తించలేకపోయింది. చలించిపోయిన స్థానికులు ఆమెకు ఆహారం అందించి, అక్కడే ఆశ్రయం కల్పించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం ఎస్ఐ రమేష్ వృద్ధురాలి వద్దకెళ్లి, ఘటనపై ఆరాతీశారు. అప్పటికే విషయాన్ని గ్రహించిన తల్లి.. పోలీసులకు నిజాలు చెబితే తన కొడుక్కి ఎక్కడ ఆపద వస్తుందోనని నోరు విప్పలేదు. బోరున విలపించడం తప్ప.. ఆమె నోటి నుంచి మాటరాలేదు. దీంతో ఎస్ఐ.. ఆమెకు ఆర్థికసాయం అందించి ఓబుళదేవరచెరువుకు చెందిన శ్రీమాతృమూర్తి వృద్ధాశ్రమానికి సమాచారం అందించారు. వృద్ధురాలిని ఆశ్రమ నిర్వాహకులకు అప్పగించారు. విషయం సోమందేపల్లిలో వ్యాపించడంతో స్థానికులు అక్కడికి చేరుకుని, ఆవేదన చెందారు. ఇలాంటి కొడుకులు ఉన్నా ఒకటే.. లేకున్నా ఒకటేనంటూ శాపనార్థాలు పెట్టారు.

అసభ్యకర పోస్టు పెడితే జైలుకే..



విద్వేషాలు రెచ్చగొడితే కేసులు

భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు

కొత్తచట్టాలు వచ్చాయి.. జరభద్రం..

హిందూపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా తొలుత ప్రజలు, ప్రభుత్వం, ప్రజానాయకులకు ఎంతగానో ఉపయోగపడింది. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో కొంత మంది జయాపజయాలు నిర్ణయించాయి. గత ఐదేళ్లలో దేశంలో ఎక్కడాలేనివిధంగా రాష్ట్రంలో సోషల్ మీడియాని వైసీపీ ఉన్మాదులు కేవలం కొంతమంది కుటుంబాలను టార్గెట్ చేస్తూ వారి ఇళ్లలో ఉన్న మహిళలను కించపరిచేవిధంగా పోస్టులు చేశారు. అప్పట్లో వీటిని ప్రశ్నించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీకి చెందిన వారిని వెంటాడి అరెస్టు చేశారు. వైసీపీ నాయకులు అసభ్యకర పోస్టు పెట్టినా, విమర్శలు గుప్పించినా వారిని పోలీసులు అరెస్టు చేయలేదు. ఒకానొక దశలో వైసీపీకి కిరాయి సైనికుల్లా పని చేశారంటే అతిశయోక్తికాదు. వైసీపీ ఘోర పరాజయం పాలై, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలైనా ఇప్పటికీ ఆ పార్టీకి చెందిన సోషల్ మీడియా బృందాలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్, వైఎస్ షర్మిలతోపాటు రాజకీయాల్లో లేని మరికొందరిపై ముఖ్యంగా మీడియా ప్రతినిధులపై అసభ్యకర పోస్టులు పెడుతూ వచ్చారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం.. అలాంటి సైకోలపై చర్యలకు ఉపక్రమించింది. ప్రస్తుతం ఎవరినోట విన్నా సోషల్ మీడియా పోస్టులపైనే మాట్లాడుకుంటున్నారు.

అసభ్యకర పోస్టులు చేస్తే జైలుకే..

రాజకీయ నాయకుల ప్రతిష్ఠకు భంగం కలిగేలా మార్ఫింగ్ ఫొటోలతో అనుచిత వ్యాఖ్యలు చేయడం, సభ్యసమాజం సిగ్గుపడేలా సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇలాంటి ఘటనలపై జిల్లాస్థాయిలో పోలీసు విభాగం, సైబర్‌క్రైం టీమ్ సునిశితంగా పరిశీలిస్తున్నాయి. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఇలాంటి వాటిపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో 20కిపైగా కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఒకసారి ఈ కేసుల్లో ఇరుక్కుంటే వారి జీవితం పూర్తిగా పాడైపోయినట్లేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. వైసీపీ సోషల్ మీడియాలో కొంతమంది రెచ్చిపోతున్న సంగతి తెలిసిందే. అవతలి వ్యక్తులను ఇష్టానుసారంగా తిడుతూ, మార్ఫింగ్ ఫొటోలు పెడుతూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్, ఎక్స్ వంటి వాటితోపాటు న్యూస్ వెబ్‌సైట్లు ఉన్నాయి.

యూట్యూబ్ చానళ్లతో సైతం వైసీపీ మూకలు అసభ్యకర పోస్టులు పెడుతున్నారు. వారు ఈ సోషల్ మీడియాలో విషం చిమ్ముతూ కామెంట్ చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబాలను టార్గెట్ చేస్తూ దూషణలకు దిగుతున్నారు. కొంతమంది ఆయా నియోజకవర్గాల్లో ఉన్న తెలుగుదేశం, జనసేన నాయకులపై సైతం దూషణలు కొనసాగుతున్నాయి. అలాంటి వారు కేసుల్లో ఇరుక్కుంటే జైలుకు వెళ్లడమేకాక భవిష్యత్తు అంధకారం అవుతుందన్న గుర్తుంచుకోవాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

కొత్త చట్టాలు వచ్చాయ్

- భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), ఐటీ, సైబర్ నేరాల చట్టాలు ఉన్నాయి. ఫేక్, మార్ఫింగ్ చిత్రాలు, వీడియోలు వైరల్ చేయడం ద్వారా ఇతరుల వ్యక్తిత్వ హననానికి పాల్పడితే 67ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలుశిక్ష, జరిమానా కూడా విధిస్తారు.
- ప్రముఖ వ్యక్తుల పేరుతో పోస్టులు పెడితే 66డి ఐటీయాక్ట్ నమోదు చేసి 3ఏళ్ల జైలు, రూ.1లక్ష జరిమానా.
- జగుప్సాకరంగా ఉన్న చిత్రాలు, వీడియోలు ఆన్‌లైన్‌లో వ్యాప్తి చేస్తే ఎలక్ట్రానిక్స్ ఎవిడెన్స్‌గా పరిగణించి, బీఎన్ఎస్ చట్టంలోని 353(2) సెక్షన్ కింద కేసు నమోదవుతుంది.
- అసభ్యకర పోస్టులు రూపొందించి, అప్‌లోడ్ చేస్తే 67ఎ ఆఫ్ ఐటీ యాక్ట్ కింద కేసు కడతారు. ఐదేళ్ల జైలు, రూ.10లక్షల జరిమానా
- తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ఒక వ్యక్తి పరువుకు భంగం కలిగిస్తే బీఎన్ఎస్ చట్టంలోని 336(4) సెక్షన్ కింద కేసు
- సమాజంలో సంఘాలు, సమూహాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే 356(2) సెక్షన్‌తోపాటు పరువునష్టం కింద కేసులు కడతారు.



ఇలా చేయడం నేరం..

ఉద్దేశపూర్వకంగాకానీ, దురుద్దేశంతోగానీ వ్యక్తిత్వ హననానికి పాల్పడకూడదు. అలాంటి సమాచారాన్ని ప్రజలకు చేరవేయకూడదు. అసత్యాలు ప్రచారం చేయకూడదు. ఎదుటి వ్యక్తుల కుటుంబాలను ఉద్దేశించి దూషిస్తూ అసభ్యకరంగా పోస్టులు పెట్టరాదు. వీటికి లైక్‌లు కొట్టడం, ఇతరులకు ఫార్వార్డ్ చేయడం నేరం. ప్రజల మధ్య కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిలేలా పోస్టులు చేస్తే జైలుకెళ్లక తప్పదు. రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడానికి వైసీపీ సోషల్ మీడియా విభాగం చేస్తున్న అరాచకాల్లో ఇరుక్కుంటే జీవితం సర్వనాశనమే.
చదువులు, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారు పోలీసుల నుంచి తప్పనిసరిగా ఎన్ఓసీ పొందాల్సి ఉంటుంది. అపుడు వారి నేర చరిత్ర పరిశీలించి, నిరభ్యంతర ధృవపత్రం అందజేస్తారు. కేసులుంటే ఎన్ఓసీ ఇవ్వరు. ఇదిలేకపోతే ఉద్యోగాలు రావు. ఒకసారి కేసు నమోదైతే ఆ వ్యక్తిపై నిఘా ఉంటుంది. పిల్లల తల్లిదండ్రులకు ఇబ్బందే. తప్పుచేసిన పిల్లలు దొరక్కపోతే తల్లిదండ్రులు స్టేషన్ల చుట్టూ తిరగాల్సిందే.

భవిష్యత్తులో ఇబ్బందులు..



ఎవరైనా అసభ్యకర పోస్టులు, వీడియోలు, చిత్రాలు పంపితే వెంటనే సమీపంలోని స్టేషన్‌లో వెళ్లి ఫిర్యాదు చేయాలి. సమాచార వ్యాప్తికి బాధ్యులెవరో గుర్తిస్తాం. విషపూరిత సమాచార మార్పిడి విషయాల్లో భాగస్వాములు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తపడాలి. పదేపదే తప్పుడు పోస్టులు పెడితే రౌడీషీట్‌గానీ, సస్పెండ్ షీట్‌గానీ, సైబర్‌బుల్లీస్ షీట్‌గానీ తెరుస్తాం. ఒకసారి ఇలాంటి కేసు పెడితే ఉపసంహరించుకోవడం అంత సులభంకాదు. దీనివల్ల భవిష్యత్తులో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

ఘనంగా వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట (ఇన్‌సెట్‌లో..), హాజరైన జనం

కదిరి అర్బన్, నవంబరు 10: స్థానిక బస్టాండు కూడలిలో ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ఖాద్రీ వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ముందుగా వడ్డెర సంఘం నాయకులు, వడ్డెర్లు ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కాలేజ్ సర్కిల్ మీదుగా బస్టాండు సర్కిల్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఎమ్మెల్యే కందికుంట, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప.. వడ్డె ఓబన్న విగ్రహాన్ని అవిష్కరించారు. ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జీవితం యువతకు ఆదర్శమన్నారు. ఆయన గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు అంజినప్ప మాట్లాడుతూ.. సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా వెనుకబడిన వడ్డెర్లకు మైనింగ్ అనుమతుల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వడ్డెర్లు తరతరాలుగా ఎదుగూబొదుగూ లేకుండా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఖాద్రీ వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు డాబా గంగయ్య, వడ్డెర్ల ఉద్యోగసంఘం జిల్లా అధ్యక్షుడు జేవీ రమణ, నాయకులు పాల్గొన్నారు.

నిరీక్షణ
వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచూపు 7
- వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత
- తీవ్ర ఇబ్బందులు పడిన రైతులు
- కూటమి ప్రభుత్వంపై ఆశలు

అంతా పచ్చదనమే..!


పచ్చదనంతో కూడిన చెట్లు

'ఉపాధి' ద్వారా పల్లె వనాల అభివృద్ధి
పశుగ్రాసం పెంపకానికి చేయూత
ప్రతి మండలంలో అమలుకు ప్రభుత్వం శ్రీకారం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెవనాలు (సహజఅడవులు), పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉపాధి జాబ్‌కార్డు ఉన్నవారి స్థలాల్లో పశుగ్రాసం పెంపకం చేపట్టనున్నారు. ఇక ప్రతి మండలంలో ప్రభుత్వ భూముల్లో పల్లెవనాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కనీసం 0.25ఎకరాల నుంచి ఎకరం విస్తీర్ణంలో ఈ పల్లెవనాలను అభివృద్ధి చేయనున్నారు. గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందుకు పూర్తి బాధ్యత ఆయా మండలం ఎంపీడీఓలు, ఉపాధి పథకం ఏపీడీలు, ఏపీఓలు తీసుకుంటారు.

1000
ఎకరాల్లో పశుగ్రాసం సాగు...

జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం పెంపకాన్ని చేపట్టనున్నారు. ప్రతి మండలంలో 25-35 ఎకరాల్లో పశుగ్రాసం సాగుచేయనున్నారు. పాడి ఉత్పత్తుల పెంపే లక్ష్యంగా బహువార్షిక గడ్డిజాతి పెంపకాన్ని చేపట్టనున్నారు. ఉపాధి పథకం కింద జాబ్‌కార్డు, పాడిపశువులు, బోరుబావి, నీటి సదుపాయం ఉన్నవారు పశుగ్రాసం సాగు చేసుకోవచ్చు. ఒక్కో రైతుకు కనీసం 10సెంట్ల నుంచి అర ఎకరా వరకు పశుగ్రాసం పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వీరికి రెండేళ్ల పాటు పశుగ్రాసం పెంపకానికి అయ్యే ఖర్చును ఉపాధి పథకం కింద చెల్లిస్తారు. రైతుపేరు, భూమి పాసుపుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డులతో సమీపంలోని ఉపాధి సిబ్బంది ద్వారా పశుగ్రాసం పెంపకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.



రెండు పనులు ఉపాధి కింద చేపడతాం



ఉపాధి పథకం కింద పచ్చదనం పెంపునకు పల్లెవనాలు, పాడిఉత్పత్తి పెంపునకు పశుగ్రాసం పెంపు పథకాన్ని అమలు చేస్తున్నాం. జిల్లాలో అర్హత కలిగిన ఉపాధి జాబ్‌కార్డుదారులు ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవచ్చు. పశుగ్రాసం పెంపకానికి రెండేళ్ల పాటు ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తాం. ఇక పల్లెవనాలు పెంపునకు కూడా ఉపాధి పథకం కింద నిధులు చెల్లిస్తారు.
-సలీం బాషా, డ్వామా పీడీ

పేకాటలో పట్టుబడిన వైసీపీ నాయకులు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ లాడ్జ్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. దుర్గమ్మగుడి సమీపంలో ఓ లాడ్జ్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 10 మంది వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.59 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని, సొంత పూచీకత్తుపై వైసీపీ నాయకులను వదిలిపెట్టారు.

26నుంచి డిగ్రీ మెగా సప్లిమెంటరీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులకు 26నుంచి మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ 2015నుంచి సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డిగ్రీ కోర్సు మూడు సంవత్సరాల వ్యవధిలో సబ్జెక్టులు పాస్‌కాని విద్యార్థులు మరో మూడేళ్లలో పూర్తిచేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివిధ కారణాల రీత్యా అనేకమంది విద్యార్థులు సబ్జెక్టులు పెండింగ్‌లో పెట్టుకున్నారన్నారు. వారిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 26 నుంచి డిసెంబరు 23వరకు మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫీజులు చెల్లించిన ప్రతి విద్యార్థి పరీక్షలకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు వారి కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని సూచించారు.

రైతును ముంచిన మొక్కజొన్న

రోడ్డు మీద పంటను ఆరబెట్టిన రైతులు



శింగనమల నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగుతో విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయంగా సాగు చేసిన పంటలతోనూ నష్టపోతున్నారు. శింగనమల మండలంలో నిరంతరం వేరుశనగ సాగుచేసే రైతులు మొక్కజొన్న పంట సాగుచేశారు. దిగుబడి బాగానే వచ్చింది. కానీ ధరలు భారీగా పడిపోవడంతో పెట్టుబడులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1000 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. పంట సాగు చేసే సమయంలో క్వింటా ధర రూ3,500 పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.2300 నుంచి 2500 వరకు వ్యాపారులు అడుగుతున్నారు. దిగుబడి వచ్చినా ధర తగ్గిపోవడం, నిల్వ చేసుకోవడానికి వీలులేకపోవడంతో కొందరు రైతులు ఉన్న ధరకే అమ్ముకుంటున్నారు. ఏ పంటలు సాగు చేసినా చివరికి నష్టాలే మిగులుతున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి ఆశాజనకం.. ధరలు పతనం



ఈసారీ నష్టాలే : వెంకటరెడ్డి, చిన్నజలాలపురం

నేను ప్రతి సంవత్సరం వేరుశనగ పంట సాగు చేస్తుండేవాడిని. ఈసారి మూడు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశాను. 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పంట కోసం ఇప్పటికే రూ.2లక్షలు ఖర్చు చేశాను. పంటను అమ్మిన రూ.లక్షన్నర లోపే వస్తుంది. ఈసారీ నష్టాలే మిగిలాయి.

దిగుబడి ఉన్నా.. ధర లేదు : రామాంజనేయులు, శింగనమల



నేను నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశాను. మా పొలం చెరువు ప్రాంతంలో ఉంది. మూడు నెలల పాటు పంటను అడవి పందుల బారి నుంచి రాత్రింబవళ్లు కష్టపడి కాపాడుకున్నాను. దిగుబడి బాగానే ఉన్నా ధర తగ్గిపోవడంతో కొనుగోలు చేసేవారు రాలేదు. గత్యంతరం లేక పంటను గ్రామంలోని దేవాలయం వద్దనే ఆరబెట్టుకున్నా.

గిట్టుబాటు ధర ఏదీ..?



మొక్కజొన్న పంటకు ధరలు పడిపోవడంతో చాలా మంది రైతులు పొలాల్లోనే పంటలను పెట్టుకున్నారు. క్వింటాపై రూ.1000 తగ్గడంతోపాటు పంట కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- మధుయాదవ్,
రైతు సంఘం, నియోజకవర్గ అధ్యక్షుడు

ఎస్టీ కమిషన్ అదేశాలు అమలు చేయాలి

ఏబీఎస్ఎస్ సెక్రెటరీ చక్రినాయక్

అనంతపురం సెంట్రల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బంజారాల అభివృద్ధికి 2019లో జాతీయ ఎస్టీ కమిషన్ విడుదల చేసిన ఆదేశాలను అమలు చేయాలని అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏబీఎస్ఎస్) రాష్ట్ర కార్యదర్శి బానోత్ చక్రినాయక్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధిలో భాగంగా సెల్‌ఫోన్ల వినియోగం పెరిగిందన్నారు. బంజారాల నివాసప్రాంతాలైన తండాలలో సెల్‌టవర్లను ఏర్పాటు చేయకపోవడంతో సిగ్నల్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బంజారాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ఏబీఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. దీంతో 2019లో రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత ఐదేళ్లలో కమిషన్ ఆదేశాలు మరుగున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వం కమిషన్ ఆదేశాలు అమలు చేసి బంజారాల అభివృద్ధిలో భాగం కావాలని విజ్ఞప్తిచేశారు.

విద్యారంగాన్ని సరిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

యాప్‌ల భారం తగ్గించాలి
యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్
ఘనంగా స్వర్ణోత్సవ మహాసభలు

కదిరి అర్బన్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): అస్తవ్యస్తంగా, గందరగోళంగా మారిన విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం సరిదిద్దాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. కదిరి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయచంద్రారెడ్డి, సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు పరచిన 117 జీఓ ఫలితంగా విద్యారంగం అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. కూటమి ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా, సమయాన్ని యాప్‌ల పనిభారంతో, ఆన్‌లైన్‌వర్క్‌తో వృధా చేస్తోందన్నారన్నారు. 1 నుంచి 5, 6 నుంచి 10 లేక ప్లస్2 వరకు ఉండేలా పాఠశాలలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అపార్ పనిని సరళీకరణ చేసి, గడువు పెంచాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎంతో పోరాటం చేసిందని, ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించలేదని అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక

శ్రీసత్యసాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా భూతన్న, అధ్యక్షుడిగా శెట్టిపి జయచంద్రారెడ్డి, సహాధ్యక్షులుగా జీహెచ్ బాబు, పీఎస్ సీతామహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా శ్రీనివాసులుతోపాటు మరో ఎనిమిది మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ రాష్ట్ర కారదర్శి కోటేశ్వరప్ప వ్యవహరించారు.

కార్మికుల జీవనోపాధికి ధరాఘాతం

- ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి



ప్రసంగిస్తున్న సోమశేఖర్ యాదగిరి

అనంతపురం కల్చరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు, మందులు, పెట్రోలియం ఉత్పత్తుల ధరల పెరుగుదలతో కార్మికుల జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతోందని ఏఐయూటీయూసీ అఖిల భారత కార్యదర్శివర్గ సభ్యుడు సోమశేఖర్ యాదగిరి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం నిర్వహించిన ఏఐయూటీయూసీ రాష్ట్ర మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ నేడు మనదేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద క్రూర దోపిడీవల్ల కోట్లాదిమంది కార్మికులు ఉపాధి, ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. నేటి మార్కెట్ సంక్షోభంలో కూడా అత్యధిక లాభాలు గడించడానికి, ప్రపంచ మార్కెట్‌లో తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి పాలస్తీనా, లెబనాన్, ఉక్రెయిన్ దేశాలపై సామ్రాజ్యవాద శక్తులు అన్యాయంగా యుద్ధాలు చేస్తూ లక్షలాదిమంది ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయన్నారు. ఏపీలో కూడా పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం ప్రవేశపెట్టిన గ్లోబలీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో లక్షలాదిమంది కార్మికులు, రైతులు జీవనోపాధి కోల్పోతున్నారన్నారు. ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, ఆర్థిక సమస్యలతో దిక్కుతోచక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గత కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను కొనసాగిస్తోంద న్నారు. కార్యక్రమంలో ఎస్‌యూసీఐ(సి) రాష్ట్ర కమిటీ సభ్యుడు రాఘవేంద్ర, ఏఐయూటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జి సుధీర్, అశోక్, ప్రమీల, నాగన్న, రామకృష్ణారెడ్డి, మంజునాథ్, కిశోర్, శేఖర్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి కబుర్లే పట్టించాయి..!

కాల్ డేటా ఆధారంగా దొరికిన ముగ్గురు
రామాంజినమ్మ మృతదేహం లభ్యం..?

అనంతపురం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న అటెండర్ రామాంజినమ్మ హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. ఆమెను హత్య చేసిన వారెవరు..? ఎందుకు చంపారో పోలీసులకు స్పష్టత వచ్చింది. కానీ, శనివారం లభించిన మృతదేహం రామాంజినమ్మదా..?కాదా...? అనేది తేల్చాల్సిన బాధ్యత పోలీసులపై పడింది. రామాంజినమ్మ గతనెల 18న అదృశ్యమైంది. నెలాఖరులో కుటుంబ సభ్యులు అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెలలో కేసు కొంత ముందుకు కదిలింది. కొన్ని సంఘటనల ఆధారంగా పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు తమకేమీ తెలియదని చెప్పుకొచ్చినట్లు సమాచారం. పోలీసులకు ఎట్టకేలకు శనివారం రామాంజినమ్మ ఇంటి సమీపంలో ఓ మహిళ మృతదేహం కనిపించింది. ఆమె ధరించిన చీర, బెడ్‌షీట్, ఇతర ఆనవాళ్లు మృతదేహం ఆమెదేనని స్పష్టం చేస్తున్నాయి. కానీ శరీరం బాగా కుళ్లిపోయి ఉండడంతో ఆ శరీరం ఆమెదేనా..?కాదా..? అనేది తేలాల్సి ఉంది. ఆదివారం వీఆర్‌ఓ సమక్షంలో పంచనామా చేయించి, అనంతరం పోస్టుమార్టం చేయించారు. ఆ మృతదేహం ఎవరిదనే విషయం తేల్చడానికి డీఎన్ఏ టెస్ట్ చేయించనున్నారు. విజయవాడలో ఆ టెస్ట్ చేయిస్తారు. మరో 10 రోజుల్లో ఆ మృతదేహం ఎవరిదనేది స్పష్టత రానుంది.



అర్ధరాత్రి ఊసులే...

రామాంజినమ్మ అదృశ్యంతో రూరల్ సీఐ శేఖర్ ఆమె ఇంటి నుంచే దర్యాప్తు చేపట్టారు. తొలుత ఎలాంటి క్లూ లభించలేదు. విచారణలో ఎదురుగా నిర్మిస్తున్న కొత్త ఇంటి పనిలో ఉన్న బేల్దారి నుంచి విచారణ ప్రారంభించారు. తొలుత తానేమీ ఫోన్‌లో మాట్లాడలేదని, సీసీ ఫుటేజీలు లేకుండానే తమను ఎలా అరెస్ట్ చేస్తారని చాలా గట్టిగానే ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో రెండు నెలల కాల్‌డేటా తీసి చూస్తే స్పష్టత రాలేదు. ఆ తరువాత ఒక సంవత్సరం కాల్ లిస్ట్‌లు, రికార్డులు బయటకు తీసినట్లు సమాచారం. దీంతో రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు ఆ యువకుడు, రామాంజినమ్మ మాట్లాడిన ఊసు కబుర్లన్నీ బయటపడ్డాయి. అదుపులోకి తీసుకున్న వ్యక్తులు చాలా ధీమాతో ఉన్నట్లు తెలుస్తోంది. శవం దొరికితే కదా అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. చూడాలి మరి రామాంజినమ్మ హత్యకేసు ఎలాంటి మలుపులు తిరుగుతుందో..?

బాలికల టెన్నికాయిట్ విజేత 'అనంతపురం'

ముగిసిన 68వ అంతర్ జిల్లా స్కూల్ గేమ్స్ పోటీలు

చింతలపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా చింతలపూడిలో ఈనెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ హైస్కూలులో జరిగిన రాష్ట్ర 68వ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ టెన్నికాయిట్ పోటీలు ఆదివారం రాత్రితో ముగిశాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికలు 390 మంది పాల్గొ న్నారు. 78 జట్లు లీగ్ నాకౌట్ పద్ధతిలో పోటీ పడ్డాయి. దీనిలో అండర్-19 బాలికల విభాగంలో అనంతపురం ప్రథమ, తూర్పుగోదావరి ద్వితీయ, చిత్తూరు తృతీయ స్థానాలు పొందాయి. అండ ర్-17 బాలికల విభాగంలో అనంతపురం ప్రథ మ, తూర్పుగోదావరి ద్వితీయ, పశ్చిమ తృతీయ స్థానాలు పొందాయి. అండర్-14 బాలికల విభా గంలో పశ్చిమ ప్రథమం, విజయనగరం ద్వితీయ, అనంతపురం తృతీయ స్థానాలు పొందాయి.

బాలుర విభాగంలో.. అండర్-19లో పశ్చిమ ప్రథమ, విజయనగరం ద్వితీయ, శ్రీకాకుళం తృతీయ, అండర్-17 బాలుర విభాగంలో ప్రథమ తూర్పుగోదావరి, ద్వితీయ విశాఖ పట్టణం, తృతీయ అనంతపురం సాధించాయి. అండర్-14 బాలుర విభాగంలో అనంతపురం ప్రథమ, పశ్చిమ ద్వితీయ, తూర్పుగోదావరి తృతీయ స్థానాలు సాధించాయి. విజేతలకు మాజీ స్పోర్ట్స్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ పేరం రవీంద్రనాథ్, పోటీల పరిశీలకులు ఎన్.టి.ప్రసాద్, స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, కె.రమేష్, కె.సురేష్‌కుమార్, హెచ్ఎం పి.సుధాక రరావు, పిట్టా వేణు, మాటూరి చక్రధరరావు, అల్లూరి గిరిరాజు తదితరుల చేతుల మీదుగా మెమెంటోలు, బహుమతులు అందజేశారు.

గెలుపే లక్ష్యంగా పరుగెత్తాలి

- యువతకు పిలుపునిచ్చిన కడప జేసీ అదితిసింగ్
- అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభం

కడప స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరైన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ఆత్మవిశ్వాసంతో పరుగెత్తాలని జేసీ అదితిసింగ్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో వేకువజామున 3 గంటలకు ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఎంపికలు సంబంధిత రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్ అధ్యక్షతన ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ అదితిసింగ్ హాజరై మొదటి దశ పరుగును జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్డీవో ఇర్విన్, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రాకేశ్‌చంద్, అనుబంధ సంఘాల అధికారులు పాల్గొన్నారు. కాగా.. కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి 4000 మంది అభ్యర్థులు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరు కానున్నారు.

అమిగోస్ ఎండీపై చర్యలు తీసుకోండి

వైసీపీ సమావేశాలకు మైనింగ్ సొమ్ము
మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్


అమిగోస్ సంస్థ ప్రసాద్‌రెడ్డి వైసీపీ సమావేశాల్లో పాల్గొన్న ఫొటోలను చూపుతున్న రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అనేక అక్రమాలకు పాల్పడిన అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మైన్స్ లీజు కాంట్రాక్టర్ రాజేష్ ప్రభుత్వాన్ని కోరారు. తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అమిగోస్ మినరల్స్ సంస్థ ఎండీ ప్రసాద్‌రెడ్డి మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించిన ఫొటోలను విడుదల చేశారు. రాజేష్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో వైసీపీ అండతో ఖనిజ సంపదను అమిగోస్ కొల్లగొట్టిందని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి ఆగడాలకు సంబంధించిన అన్ని ఆధారాలు తన వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇవ్వడం, చెక్‌పోస్టులు పెట్టి, బెదిరించి మైనింగ్ లీజ్ కాంట్రాక్టర్ల నుంచి కోట్లాది రూపాయల వసూళ్లకు పాల్పడ్డారని విమర్శించారు. మైనింగ్‌లో సంపాదించిన సొమ్మును కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లో సమావేశాల నిర్వహణ, వైసీపీకి ఎన్నికల్లో వినియోగించారని మండిపడ్డారు. వైసీపీ హయాంలో మైన్స్ లీజ్ కాంట్రాక్టర్లను బెదిరించి, కేసులు పెట్టి వేధించారని తెలిపారు. ఎంతో మంది మైన్స్ లీజు కాంట్రాక్టర్లను నష్టపరిచి సొమ్ము దోచుకున్నారని ఆరోపించారు. అమిగోస్ ప్రసాద్‌రెడ్డి దోచుకున్న ఖనిజసంపదను కక్కించాలని, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌ను కలిసి వివరిస్తానని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ప్రధాన రహదారి పక్కన మట్టికుప్పలు
చోద్యంచూస్తున్న అధికారులు

చెరువులోని మట్టిని తవ్వుతున్న దృశ్యం


గాండ్లపెంట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి పక్కనే వున్న చెరువులో వైసీపీ నాయకుడు మట్టిని తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గాండ్లపెంట మండలంలోని కదిరి - రాయచోటి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కోటపల్లి చెరువులో గత మూడు రోజుల నుంచి జేసీబీతో మట్టిని తవ్వేస్తూ ట్రాక్టర్లతో సొంత భూమిలోకి తరలిస్తున్నారు. ప్రధాన రహదారిలోని నీరు పొలంలోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేసుకుంటున్నాడు. రోడ్డు పక్కన చెరువులోని బంకమట్టి తోలడంతో వర్షా కాలంలో వాహనాలు పక్కకు వెళితే కురుకుపోయే ప్రమాదం ఉందని వాహనదారులు వాపోతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నాడని తెలుస్తోంది. ఇప్పటికే చెరువు కట్ట సమీపంలో మట్టి తవ్వడంతో కట్ట కూడా దెబ్బతినే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో మట్టిని ఇష్టానుసారంగా తరలిస్తున్నాడు. ప్రధాన రహదారిలోనే యథేచ్ఛగా మట్టి తరలిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రధాన రహదారి పక్కన వదిలిన మట్టి కుప్పలు

న్యూస్‌బాక్స్

హాకీ చాంపియన్ ఆర్ట్స్ కళాశాల జట్టు



ఆర్ట్స్ కళాశాల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ అంతర్ కళాశాలల గ్రూప్-సి హాకీ విజేతగా ఆర్ట్స్ కళాశాల జట్టు నిలిచింది. శ్రీకృష్ణదేవరాయ అంతర్ కళాశాలల గ్రూప్-సి పోటీలలో భాగంగా ఆదివారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఫైనల్ పోటీల్లో ధర్మవరం జట్టుపై ఆర్ట్స్ కళాశాల జట్టు 3 గోల్స్ తేడాతో విజేతగా నిలిచింది. విజేతగా నిలిచిన ఆర్ట్స్ కళాశాల జట్టు, రన్నర్ ధర్మవరం జట్లకు ఎస్కే యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ జెస్సీ కప్ అందజేశారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి, పీడీ శ్రీరామ్, చంద్రమోహన్ రెడ్డి విజేత జట్టును అభినందించారు.

1.623 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీటి నిల్వ 1.623 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 924 క్యూసెక్కులుండగా.. ఔట్‌ఫ్లో కింద హెచ్ఎల్ఎస్-2కు 1011 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

విషాదంలోనూ దాతృత్వం
ఆత్మహత్య చేసుకున్న రైతు కళ్లు దానం



కళ్లను అందిస్తున్న కుటుంబ సభ్యులు

కనగానపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విషాదం సమయంలో కూడా రైతు కుటుంబం తమ దాతృత్వాన్ని చూపింది. అప్పులబాధ తాళలేక చెన్నేకోట నరసింహులు శనివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మృతుడి భార్య భారతి, కుమారుడు సతీష్ బాధలో కూడా నరసింహులు కళ్లను దానం చేసేందుకు ముందుకొచ్చారు. ఆదివారం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో రైతు నరసింహులు రెండు కళ్లను సేకరించి భద్రపరిచారు. రైతు కుటుంబాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ నాయకులు యాతం పోతలయ్య, నెట్టెం వెంకటేష్, సుధాకర్‌చౌదరి, బంగి మల్లేష్, బొజ్జన్న, రమేష్ పరామర్శించారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మడకశిరటౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం తుమకూరు ప్రాంతానికి చెందిన మోహన్‌కుమార్ అనే వ్యక్తి హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం సీఐ కార్యాలయంలో హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. 2023 ఆగస్టు 23న నాగరత్నమ్మ తన పెద్ద కుమారుడు మోహన్‌కుమార్ (52) కనిపించలేదని తుమకూరులోని జయనగర్ పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు వివరించారు. మృతుడి భార్య కవిత అక్తర్‌పాషా అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పరచుకొందని, విషయం భర్తకు తెలియడంతో గొడవ జరిగిందన్నారు. కవిత అక్తర్‌పాషా సహకారంతో తుమకూరు పట్టణంలో ఒక హోటల్‌ను ఏర్పాటు చేసుకొందని, అక్కడికి వెళ్లి భర్త మోహన్‌కుమార్ గొడవపడ్డారని వివరించారు. దీంతో ఎలాగైనా భర్త అడ్డు తొలగించుకోవాలని కవిత ఆమె కొడుకు కౌషిక్, అక్తర్‌పాషా, హోటల్లో పనిచేసే మోహన్‌ప్రసాద్ పథకం రచించారని అన్నారు. మోహన్‌కుమార్‌ను హోటల్‌కు పిలిపించి బిర్యానీలో నిద్రమాత్రలు కలిపి తినిపించారని తెలిపారు. రాత్రి దాదాపు 10.30 గంటల సమయంలో కత్తిలో గొంతు కోసి హత్యచేశారని తెలిపారు. మృతదేహాన్ని మడకశిర మండలం కదిరేపల్లి సమీపంలో రోడ్డు పక్కనే హంద్రీనీవా కాలువలోకి పడేసి వెళ్లినట్లు తెలిపారు. అప్పటి సీఐ సురేష్‌బాబు దర్యాప్తు కొనసాగించారని, తిరిగి సీఐగా వచ్చిన రాజ్‌కుమార్, గుడిబండ ఎస్ఐ మునిప్రతాప్ నిందితులను శనివారం అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ వివరించారు.

ప్రాణాలతో చెలగాటం

- అనంతపురం-తాడిపత్రి రహదారిపై నిత్యం ప్రమాదాలు
- ఈ రోడ్డులో ప్రయాణమంటే హడల్
- కనిపించని హెచ్చరిక బోర్డులు
- ప్రాణాలు పోతున్నా చలించని అధికారులు



గత నెల 26న ప్రమాదం జరిగిన ప్రదేశం

శింగనమల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. శింగనమల నియోజకవర్గ పరిధిలో ఫోర్‌లేన్ రహదారి రోడ్డు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సూచికలు పెట్టకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రమాదాల్లో పదుల సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందారు. ఈ రహదారిలో ప్రతి రోజూ ఏదో ఒక చిన్న ప్రమాదం జరుగుతుండడంతో వాహనదారులు గాయాలపాలవుతున్నారు. అక్టోబరు 26న నాయనిపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏకంగా ఆరుగురు ఇస్కాన్ భక్తులు మృతి చెందారు. రోడ్డు పనులు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచికలు, హెచ్చరికలు పెట్టకపోవడంతో ఎక్కడ ఏమి జరుగుతుందోనని వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని ప్రయాణిస్తున్నారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్టు కూడా లేకపోవడం విస్మయం కలిగిస్తోంది.

ప్రమాదం తర్వాత హెచ్చరిక బోర్డు

నాయనిపల్లి క్రాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన మరుసటి రోజు అక్కడ ప్రమాద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ పని ముందే ఎందుకు చేయలేదన్న విమర్శలు స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. నాయనపల్లి క్రాస్ మధ్యలో బ్రిడ్జి ఏర్పాటు చేస్తున్నారు. బ్రిడ్జి ఏర్పాటుకు సంబంధించి పెద్ద బీమ్‌ను ఏర్పాటు చేశారు. ఇంకా బ్రిడ్జి పనులు జరగడం లేదు. అనంతపురం - తాడిపత్రి మధ్య తిరిగే వాహనాలు నాయనిపల్లి క్రాస్ వద్దకు రాగానే ఎదురెదురుగా క్రాస్ చేయాల్సి వస్తోంది. అక్కడ బ్రిడ్జి నిర్మాణానికి పెద్ద బీమ్ ఏర్పాటు చేయడంతో అనంతపురం నుంచి తాడిపత్రి వైపునకు వెళ్లే వాహనాలు బ్రిడ్జి ఎడమవైపు నేరుగా వెళ్లేందుకు మార్గం లేదు. బీమ్‌కు కుడివైపుగానే వెళ్లాల్సి వస్తోంది. బ్రిడ్జికి రెండు వైపులా సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేసి ఉంటే ఈ ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉండేది కాదని స్థానికులు అంటున్నారు.

బ్రిడ్జి నిర్మాణాల వద్ద సూచికలేవీ..?

ఫోర్‌లేన్ రోడ్డు పనుల్లో భాగంగా శింగనమల నియోజకవర్గ పరిధిలోని బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం నుంచి శింగనమల మండలం నాయనపల్లి క్రాస్, నార్పల మండలం మద్దలపల్లి వరకు 16 కిలోమీటర్ల మేర పనుల్లో భాగంగా ప్రతి గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కనీసం సూచికలు, హెచ్చరికల బోర్డు లేకపోవడం గమనార్హం. సర్వీస్ రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు పనులు జరిగే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలతో వచ్చే దుమ్మూధూళితో ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించని పరిస్థితి ఏర్పడింది. డైవర్షన్ రోడ్డు వద్ద కనీసం ప్రమాదం సూచికలు ఏర్పాటు చేయలేదు. వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా డైవర్షన్ల వద్ద సూచికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు పనులు ప్రారంభమైనప్పటి నుంచి శింగనమల మండల పరిధిలోనే 11 మంది మృతి చెందగా 200 మందికి పైగా వాహనదారులు గాయపడ్డారు.



బ్రిడ్జిల వద్ద తారురోడ్డు వేయాలి

దారి పొడవునా బ్రిడ్జిల నిర్మాణాలు జరుగుతున్నాయి. అనంతపురానికి వాహనంలో వెళ్లాలంటేనే భయంగా ఉంది. బ్రిడ్జిలు ఏర్పాటు చేసే ప్రాంతాల్లో సర్వీస్ రోడ్డును మట్టితో వేయడంతో దుమ్ము, ధూళి ఎక్కువై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. డైవర్షన్ దారుల్లో ఎలాంటి హెచ్చరిక, సూచకల బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు చిన్న, చిన్న జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చు.

- లక్ష్మీనారాయణ, పెరవలి



అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

అధికారుల నిర్లక్ష్యంతోనే నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇస్కాన్ భక్తుల మృతికి అధికారుల నిర్లక్ష్యమే కారణం. నాయనపల్లి క్రాస్‌లో ఎలాంటి హెచ్చరిక, సూచికల బోర్డులు ఏర్పాటు చేయలేదు. క్రాస్ మధ్యలో బ్రిడ్జి బీమ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఒకే వైపు ఎదురెదురుగా వాహనాలు క్రాస్ చేయాల్సి వస్తోంది. అక్కడ కనీసం సూచికల బోర్డు ఏర్పాటు చేయలేదు. ఘోర రోడ్డు ప్రమాదం జరిగిన తర్వాత అధికారులు బోర్డు ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా రోడ్డు పనులు జరిగే చోట, డైవర్షన్ల వద్ద పగలు, రాత్రి వేళల్లో వాహనదారులకు కనిపించేలా సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలి.

- షామీర్, నాయనపల్లి క్రాస్

వ్యవసాయ పరికరాల కోసం
ఎదురుచూపు



- వైసీపీ ప్రభుత్వంలో నిలిపివేత
- తీవ్ర ఇబ్బందులు పడిన రైతులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని, వ్యవసాయానికి పెద్దపీట వేశామని చెప్పుకొచ్చిన వైసీపీ సర్కారు ప్రకటనలకే పరిమితమైంది. గత ఐదేళ్లు అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ప్రధానంగా వ్యవసాయ పరికరాలు, సూక్ష్మ పోషకాలకు మంగళం పాడేసింది. చివరకు టార్పాలిన్లను కూడా అందించలేకపోయింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీటిని రాయితీపై పంపిణీ చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వం విస్మరించడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఐదేళ్లూ అంతే..

సాగుకు యంత్రపరికరాలు ఎంతో అవసరం. స్ప్రేయర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు రైతులకు సాగులో సహాయకారిగా ఉంటాయి. మంచి దిగుబడులు వచ్చేందుకు సూక్ష్మపోషకాలు అవసరం. కల్లాల్లో పంట ఉత్పత్తుల రక్షణకు టార్పాలిన్లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. గత ఐదేళ్లు రాయితీపై వీటిని పంపిణీ చేయలేదు. దీంతో రైతులు తీవ్రకష్టాలు పడ్డారు. ప్రధానంగా స్ప్రేయర్ల కొరతను ఎదుర్కొన్నారు. రాయితీ స్ప్రేయర్ల కోసం వైసీపీ హయాంలో వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. మందు పిచికారి చేయడానికి రైతులు ఇబ్బందులు పడ్డారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేసింది. స్ప్రేయర్లతోపాటు కల్టివేటర్లు, పవర్ వీడర్, ట్రాక్టర్ల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

సూక్ష్మ పోషకాల కోసం పాట్లు

సూక్ష్మ పోషకాల లోపంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం వాటిని రైతులకు అందించేది. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు పంపిణీ చేపట్టలేదు. సూక్ష్మపోషకాల (జింక్, బోరాన్, మెగ్నీషియం, గంధకం, ఇనుము, మాంగనీస్, రాగి, భాస్వరం, నత్రజని, పొటాషియం) కోసం రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. డిమాండ్ దృష్ట్యా వాటి ధరలు అమాంతం పెరిగిపోవడంతో రైతులపై ఆర్థిక భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. యంత్ర పరికరాలు, సూక్ష్మపోషకాల కోసం ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయ పరికరాలు ఇవ్వాలి



వైసీపీ ప్రభుత్వంలో రైతులకు వ్యవసాయ పరికరాలు అందక బయట మార్కెట్‌లో కొనుగోలు చేసే పరిస్థితి ఏర్పడింది. గుంటక, మడకలు, స్ప్రేయర్లు, రోటోవేటర్లు, టార్పాలిన్‌లు కూడా అందించలేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. కొందరు రైతులు అప్పులు చేసి బయట మార్కెట్‌లో అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా వ్యవసాయ పరికరాలు అందించాలి.

- చంద్రశేఖర్, బండ్లపల్లి, కొత్తచెరువు మండలం

సూక్ష్మ పోషకాలు పంపిణీ చేయాలి..



పండ్లతోటలకు సబ్సిడీతో అందించే సూక్ష్మపోషకాలను కూడా గత వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదు. స్ప్రేయర్లు, టార్పాలిన్ పంపిణీ నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం సూక్ష్మపోషకాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలి. రైతులకు మేలు చేసే విధంగా బిందు సేద్యపరికరాల పంపిణీ కూడా సులభతరం చేయాలి.

- తమ్మినేని రామ్మోహన్, రామాపురం, తాడిమర్రి మండలం

బిల్లులు రాలే

- ఉమ్మడి జిల్లా హాస్టళ్లకు రూ. 12 కోట్లకుపైగా పెండింగ్
- నాలుగు నెలలుగా అందని వైనం
- ఇబ్బందులు పడుతున్న వార్డెన్లు, విద్యార్థులు



భోజనం కోసం లైన్లో ఉన్న విద్యార్థులు (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బిల్లులు సకాలంలో రాకపోవడంతో సంక్షేమశాఖ వసతి గృహాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో నవంబరు నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూన్ వరకూ మంజూరు చేసింది. అయితే జూలై నుంచి ఇప్పటి వరకూ మళ్లీ బిల్లులు పెండింగ్ పడ్డాయి. ఇంత వరకూ బిల్లులకు సంబంధించి బడ్జెట్ రాకపోవడంతో వార్డెన్లు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వార్డెన్లు అప్పులు తెచ్చి డైట్‌ను అమలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల మెనూను కుదించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాకు నాలుగు నెలలకు కలిపి దాదాపు రూ. 12 కోట్లకుపైగా డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆయా శాఖల అధికారుల ద్వారా తెలిసింది.

నాలుగు నెలల బిల్లులు పెండింగ్...

జిల్లాలో ఉన్న 58 బీసీ హాస్టళ్లలో 8027 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 59 బీసీ హాస్టళ్ల ఉండగా... 6281 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం జిల్లాలో 58 ఎస్సీ హాస్టళ్ల ఉండగా... 5791 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీసత్య సాయి జిల్లాలో 27 ఎస్సీ హాస్టళ్ల ఉండగా... 1897 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. అనంతపురం జిల్లాలో 10 గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా అందులో 590 విద్యార్థులు వసతి పొందుతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 9 గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు ఉండగా... అందులో 427 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని బీసీ,ఎస్సీ,ఎస్టీ వసతిగృహాలకు జూలై నెల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

పెండింగ్ వాస్తవమే

వసతిగృహాలకు సంబంధించిన డైట్ బిల్లులు జూలై నుంచి పెండింగ్‌లో ఉన్నది వాస్తవమే. ఇందుకు సంబంధించిన బడ్జెట్ రాష్ట్రస్థాయి నుంచి రావాల్సి ఉంది. సమస్య గురించి పైస్థాయి అధికారులకు వివరించాం. తొందరలోనే బడ్జెట్ వచ్చే అవకాశం ఉంది. వచ్చిన వెంటనే డివిజన్ల వారిగా బడ్జెట్‌ను కేటాయిస్తాం.

కుష్బూకొఠారీ, డీడీ, బీసీ,ఎస్సీ సంక్షేమశాఖలు

అక్రమ మద్యంపై
ఎక్సైజ్ మెరుపు దాడులు

- 72 మంది బెల్టుషాపు నిర్వాహకులపై కేసులు
- 1300 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత
- నాటుసారా స్థావరాలపై దాడులు
- 33 కేసుల నమోదు
- 4600 మంది బైండోవర్



గుంతకల్లు మండలంలో నాటు సారా బెల్లపు ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా విభాగాల ఏఈఎస్, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది బృందాలుగా విడిపోయి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాడులు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వచ్చే అక్రమ మద్యాన్ని పట్టుకుంటున్నారు. నాటుసారా స్థావరాలపై ఆకస్మిక దాడులు చేసి నాటు సారా ఊటలను ధ్వంసం చేస్తున్నారు. మరోవైపు పలు మండలాల్లో బెల్ట్ షాపులపైనా దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేశారు. ఇప్పటి దాకా 4600 మంది పాత ముద్దాయిలను బైండోవర్ చేశారు. ఆ వ్యక్తులు మరోసారి మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే స్థానిక తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసి అపరాధ రుసుం వసూలు చేయనున్నారు. అపరాధ రుసుం చెల్లించకపోతే రిమాండ్‌కు తరలిస్తామని ఎక్సైజ్ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు.

1300 లీటర్ల అక్రమ మద్యం పట్టివేత

ఉమ్మడి అనంత జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, డి.హీరేహాల్, హిందూపురం సరిహద్దు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా చేసే అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నెల నుంచి ఇప్పటి దాకా ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న 169 మందిని అరెస్టు చేసి, 1300 లీటర్లకుపైగా మద్యాన్ని పట్టుకున్నారు. అక్రమ మద్యం రవాణాకు ఉపయోగించిన 29 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

72 మంది బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు

ఉమ్మడి జిల్లాలోని ధర్మవరం మండలం వసంతాపురం క్రాస్, నార్పల మండలం కేశేపల్లి, దుగ్గుమర్రి, బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లి, రాప్తాడు మండలం పాలచెర్ల, శెట్టూరు మండలం చెర్లోపల్లి, అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి, విడపనకల్లు మండలం కరకముక్కల, రాయదుర్గం మండలం డి.కొండాపురం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై దాడులు చేశారు. ఇందులో భాగంగా 72 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో 210 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం రవాణాకు ఉపయోగించిన మూడు వాహనాలను సీజ్ చేశారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నాటు సారా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నారు. ఏ,బీ,సీ కేటగిరీలుగా బృందాలను ఏర్పాటు చేసుకొని ముందస్తు ప్రణాళికల మేరకు నాటు సారా స్థావరాలపై దాడులు చేస్తున్నారు. వజ్రకరూరు, తాడిపత్రి, నార్పల, ఆత్మకూరు, బెళుగుప్ప ముదిగుబ్బ మండలాల్లోని పలు ప్రాంతాల్లో నాటు సారా స్థావరాలపై దాడులు చేశారు. ఇప్పటి దాకా 33 కేసులు నమోదు చేసి 70 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 6300 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు.

జిల్లా నుంచి బహిష్కరిస్తాం



ప్రజల ప్రాణాలకు ముప్పుతెచ్చే విధంగా తీవ్రమైన ఎక్సైజ్ నేరాలకు పాల్పడే వారిపై (నాటు సారా, కల్తీ కల్లు, అక్రమ మద్యం, గంజాయి) పీడీ యాక్టు ప్రయోగించి జిల్లా బహిష్కరణ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఎక్సైజ్ నేరాల నియంత్రణ కోసం ఉమ్మడి అనంత జిల్లాలో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నాం. మద్యం షాపుల్లో నిబంధనలు అతిక్రమించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా ఉపేక్షించేది లేదు. అక్రమ మద్యం, నాటు సారా, బెల్ట్ షాపుల నిర్వహణకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా ఉంచాం. ఆ మేరకు ఆకస్మిక దాడులు నిర్వహించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-నాగమద్దయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ముగిసిన అఖండ భజన



పాటలు పాడుతున్న విద్యార్థినులు

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జయంతి వేడుకల సందర్భంగా చేపట్టిన ముందస్తు అఖండ భజన ఆదివారం రాత్రి 6గంటలకు ముగిసింది. శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన అఖండ భజన 24 గంటల పాటు నిరంతరంగా కొనసాగి సాయంత్రం 6 గంటలకు మంగళహారతితో ముగిసింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో మంగళహారతితో అఖండ భజన ముగించి భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ప్రాచీన ఆలయాల విశిష్టతను చాటాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

పుట్టపర్తి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన ఆలయాల విశిష్టతను తెలియజేయడం కోసం మరింత సాహిత్యం వెలుగులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గుండ్లూరు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాయిఆరామంలో చరిత్రకారుడు మైనాస్వామి రాసిన 'ప్రాచీన ఆలయాల వైభోగం' పుస్తకావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన ఆలయాల వైభవాన్ని ప్రపంచానికి తెలియజేయాలని చేస్తున్న కృషిని కొనియాడారు. రాష్ట్రంలో కొన్ని వేల ఆలయాలు ఉన్నాయని, వాటికి సంబంధించిన సమగ్ర సమాచారం అతితక్కువగా లభ్యమవుతోందన్నారు. ప్రతి ఆలయంపై ఒక పుస్తకాన్ని తీసుకురావాలని దేవదాయశాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. పుస్తక రచయిత మైనాస్వామి మాట్లాడుతూ బృహత్తర పర్యాటక వలయంలో భాగంగా తాను ప్రాచీన ఆలయాల వైభోగాన్ని ప్రపంచానికి తెలియజేయాలని పుస్తక రచన చేశానని తెలిపారు. జిల్లాలోని హేమావతి నుంచి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి వరకు గల ప్రాచీన ఆలయాలపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఒక నివేదికను సమర్పించినట్లు పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి జరిగితే ఆయా ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయని, ఉపాధి పెరుగుతుందని, తద్వార ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుందని వివరించారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, వీహెచ్‌పీ నాయకుడు డాక్టర్ వేదవ్యాస్, టీడీపీ నాయకుడు సామకోటి ఆదినారాయణ, పుడా మాజీ ఛైర్మన్ కోటా సత్యం, పురపాలకసంఘం ఫ్లోర్‌లీడర్ రత్నప్పచౌదరి, బీజేపీ నాయకుడు కొండమరాజు చరిత్రకారుడు మైనాస్వామి కృషిని ప్రశంసించారు.

న్యూస్ బాక్స్..

కార్తీకమాస పూజలు

తాడిమర్రి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురష్కరించుకొని మండలంలోని కాటకోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. సోమవారం ఈశ్వరుడికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో ఆదివారం సాయంత్రమే భక్తులు ఆలయం వద్దకు చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం ఉదయం గదే గుండంలో స్నానమాచరించి అభిషేక కార్యక్రమాల్లో పాల్గొంటారు.



ప్రత్యేక అలంకరణలో కాటకోటేశ్వరుడు

ఇస్కాన్‌లో భాగవత ప్రవచనాలు

ధర్మవరంరూరల్, నవంబరు10(ఆంధ్రజ్యోతి): స్థాని క మార్కెట్‌యార్డు సమీపంలో ఇస్కాన్ మంది రంలో ఆదివారం ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ శ్రీభాగవతప్రవచనాలపై భక్తులకు వివరించారు. ముందుగా జగన్నాథ్, బలరామ, సుభద్ర స్వామివారి ప్రతిమలను విశేషంగా అలంకరణ చేసి హరినా మసంకీర్తనలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుని భాగవత ప్రవచనాలు చేశారు. భగవంతునికి ప్రత్యేకంగా పలురకాల నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో ధర్మవరం ఇస్కాన్ భజన భక్తబృందం పాల్గొన్నారు.



అలంకరణలో జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర

11 గంటలకే జారుకున్న బీఎల్‌ఓలు

నిరాశతో వెనుదిరిగిన యువకులు



పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓలు లేని దృశ్యం

కొత్తచెరువు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు క్లైంలను చేర్పులు, మార్పులు తదితర వాటికి సంబంధించి బీఎల్‌ఓలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. అందులో భాగంగా ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విధులు నిర్వహించాల్సిన బీఎల్‌ఓలు 11గంటలకే జారుకున్నారు. దీంతో బీఎల్‌ఓలు లేక పోలింగ్ కేంద్రాలు వెలవెలబోయాయి. ఆదివారం కావడం అధికారులు ఎవరు పర్యవేక్షణకు రారు అన్న ధీమాతో మండల వ్యాప్తంగా చాలా పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు లేక.. ఓటు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన యువతీయువకులు వెనుతిరిగి వెళ్లారు.

మనోబంధు సేవలపై సమావేశం

ధర్మవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మనోబంధు సేవలపై ఆదివారం సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో మానసిక బాధితులైన వారికి పునరావాస కల్పించడానికి జిల్లాలో స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేయడానికి ఈ సమావేశం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటి జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ మాట్లాడుతూ.. వచ్చేనెల 3న ధర్మవరంలో పోలా ఫంక్షన్‌హాల్ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మనోబంధు కవిత శీర్షిక ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు జయసింహ, నరేంద్రరెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన క్రికెట్ పోటీలు

ధర్మవరం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు ఆదివారమూ కొనసాగాయి. ఈ టోర్నీలో ఆరు మ్యాచ్‌ల్లో 12 జట్లు పాల్గొన్నాయి. వీటిని వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ప్రారంభించారు. విశ్వనాథ్ జట్టుపై ఎస్ఎల్‌వీ జట్టు, చాలెంజర్ జట్టుపై నాయక్ జట్టు, టైటాన్స్ జట్టుపై సోమందేపల్లి జట్టు, దంపెట్ల జట్టుపై అగ్రహారం జట్టు, కనగానపల్లి జట్టుపై మేడాపురం, ఎర్రోనిపల్లి జట్టుపై వెంకటన్న లయన్స్ గెలిచాయి. కార్యక్రమంలో జింకా పురుషోత్తం, శ్యాంసుందర్, అఖిల్, జావేద్, భరత్, అన్నం సాయినాథ్, ఫయాజ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో భారత్ ఆర్ట్స్ సమస్త, బాలోత్సవ్ చిల్డ్రన్స్ డే సెలెబ్రేషన్స్‌లో ధర్మవరం రాకింగ్ స్టార్స్ డాన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు డ్యాన్స్ మాస్టర్ లోకేశ్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలలో ధర్మవరం రాకింగ్‌స్టార్స్ డాన్స్ అకాడమీ విద్యార్థులు సోనీ, తన్మాయ్, శ్రావణి, వందన, శిరీష, దిలీప్, కావ్య, సునీల్ చేసిన నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచారు. దీంతో ఈ విద్యార్థులకు సీనియర్ యాక్టర్స్ దివ్య, జబర్దస్థ ఆర్టిస్టులు సర్టిఫికెట్లను అందించి సత్కరించారు.



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

కనవయ్యా.. ఖాద్రీశా..!

- ఆలయ దుకాణాల్లో అన్నీ రెట్టింపు ధరలే
- చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ పాయింట్‌లో మితిమీరిన రేట్లు
- గుండు చేయించుకోవాలంటే జేబు ఖాళీ అవ్వాల్సిందే
- రెండు సంవత్సరాలుగా ఆలయ గదుల్లో తిష్టవేసిన ఉద్యోగులు
- అధిక ధరలపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకోని అధికారులు



కదిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది భక్తులు ఇరుగు.. పొరుగు రాష్ట్రాల నుంచీ వస్తుంటారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం ఆధ్వర్యంలో కొన్ని సేవలను ప్రైవేటు వారికి అప్పగించారు. అందులో భాగంగా చెప్పుల స్టాండు, సెల్‌ఫోన్ భద్రపరిచే కౌంటర్, లగేజి కౌంటర్ తదతరలు ఉన్నాయి. వీటిల్లో ఆలయ అధికారులు నిర్ణయించిన ధరకే సేవలు అందించాలి. టెండర్ ప్రకటనలోనే ఆ రేట్లు పొందుపరిచి ఉంటారు. ఆ రేట్లను కాదని ప్రతి చోట రెట్టింపు ధరలు వసూలు చేస్తున్నారు. సామాన్య భక్తులకు ఇది మోయలేని భారంగా ఉంది.

● మితిమీరిన రేట్లు



ఆలయం వెలుపల ఆలయానికి సంబంధించిన చెప్పుల స్టాండ్, సెల్‌ఫోన్ పాయింట్, లగ్గేజీ కౌంటర్ ఏర్పాటు చేశారు. యేడాదికి లీజుకిచ్చారు. చెప్పులకు జతకు రూ.ఐదు, సెల్ ఫోన్ రూ. ఐదు, లగ్గేజీ బ్యాగుకు రూ. 10గా అధికారులు నిర్ణయించారు. అదే ధరలు అమలు చేయాల్సి ఉంది. కానీ లీజుదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. జత చెప్పులకు రూ.పది ఇచ్చేంతవరకు చెప్పులివ్వడంలేదు. కొన్నిమార్లు మరింత ఎక్కువగా వసూలు చేస్తున్నారు. రూ. ఐదే కదా అని ప్రశ్నిస్తే భక్తులపై దౌర్జన్యానికి దిగిన సంఘటనలు అనేకం. సెల్‌ఫోన్లు భద్ర పరచడానికి రూ. ఐదు వసూలు చేయాల్సి ఉండగా రూ. పది వసూలు చేస్తున్నారు. కౌంటర్లు ఆలయం వెలుపల ఒకటి... అదనంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఆలయంలో కూడా మరో కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. అయినా ఆలయాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. లగేజీ బ్యాగులకు రూ. పది వసూలు చేయాల్సిఉండగా చిన్న బ్యాగు అయినా రూ. 40 వసూలు చేస్తున్నారు. పెద్దబ్యాగులైతే రూ. 50 నుంచి వంద వసూలు చేస్తున్నారు. ఇలా టెండరుదారులు అధిక ధరలు వసూలు చేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. కొన్నిమార్లు పెద్దఎత్తున గొడవలు జరిగినా, ఆలయాధికారులు మాత్రం స్పందించడంలేదు. నెలనెలా వారికి వాటాలు అందుతుండటంతోనే అధికారులూ ఏమి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. భక్తులు ఆలయ ఆవరణంలో చెప్పులు విడిచిపెట్టి వెళ్లితే లీజుదారులు దౌర్జన్యంగా తమవద్దకు తెచ్చుకుని డబ్బులిచ్చేంతవరకు చెప్పులు ఇవ్వబోమని బెదిరిస్తున్నారు.

● తలనీలాల వద్ద...



అధికారికంగా తలనీలాలు తీయడానికి ఆరుగురు ఉద్యోగులుంటే.. మరో 15 నుంచి 20 మంది అనాధికారికంగా ఉన్నారు. వీరందరూ శని, ఆది, సోమవారాల్లో ఎక్కువగా ఉంటారు. అనాధికారికంగా ఉన్న వీరు తలనీలాలు సమర్పించే భక్తుల నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. తలనీలాల టిక్కట్ రూ. 25 ఉంటే, రూ.150కిపైగా వసూలు చేస్తున్నారు. ఇక్కడ పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డబ్బులు ముందే డిమాండ్ చేసి మరీ వసూళ్లు చేస్తున్నారు. ఉచితంగా తీయాల్సిన తలనీలాలను, డబ్బులిచ్చేంతవరకు తీయడం లేదు. డబ్బులు ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే.. ఇక గుండు నిండా కాట్లే.. దీనిపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయిందని భక్తులు వాపోతున్నారు.

● అక్రమంగా గదుల్లో తిష్ట

ఆలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు ఇతర ప్రాంతాల నుంచి కదిరి ఆలయానికి బదిలీ అయ్యారు. వచ్చిన కొత్తలో అద్దె ఇళ్లు దొరికెంతవరకు ఆలయం గ దిలో ఉన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ గది ఖాళీ చేయలేదు. పై అధికారికి తెలిసినా, దీనిపై ఎటువంటి చర్యలు లేవు. సంవత్సరాల తరబడి ఆలయ గదుల్లో ఉండడం వలన ఆలయ ఆదాయానికి గండి పడడంతో పాటు, గదుల కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. అలాగే చెప్పుల స్టాండ్, లగేజీ కౌంటర్ టెండరుదారులు స్థానికులు కాకపోవడంతో వారికి రెండు నెలల ముందువరకు ఆలయ గదులించినట్లు సమాచారం. వీటిపై ఈఓను ఫోన్‌లో వివరణకోగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

చర్యలు తీసుకోవాలి



ఆలయానికి వచ్చే భక్తుల నుంచి చెప్పుల స్టాండ్, లగేజీ కౌంటర్, తలనీలాల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారు. వీటిపై ఆలయాధికారులకు కూడా ఫిర్యాదు చేశాం. అయినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకుని భక్తులకు సౌకర్యాలు కల్పించాలి.

- హరిప్రసాద్, మంగలిమహాసభ నాయకుడు, కదిరి





ముదిగుబ్బ జడ్పీహెచ్ఎస్, ధర్మవరం బీఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమావేశం

ముదిగుబ్బ, నవంబరు10(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 1990-91లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో 34 సంవత్సరాల తర్వాత సమావేశయ్యారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

● బత్తలపల్లి: మండలంలోని నల్లబోయనపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2002-2003లో పదో చదివిన విద్యార్థులు ఆ పాఠశాలలో ఆదివారం సమావేశయ్యారు. నాటి విద్యార్థులు శ్రీకాంత్, రమణ,రవి, నారాయణస్వామి పాల్గొన్నారు.

● ధర్మవరం :పట్టణంలోని మున్సిపల్ బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 2003-04 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి గురువులు రాంప్రసాద్, శ్రీనివాసులురెడ్డి, లక్ష్మీనారాయణ, సంజీవయ్య, శ్రీనివాసులను సత్కరించారు.



బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లిలో పూర్వవిద్యార్థులు

కేసులకు భయపడం

- సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు ఆపాలి
- లేకుంటే మళ్లీ అధికారంలోకి వచ్చి తడాఖా చూపుతాం
- వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ హెచ్చరిక



కదిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : 'మా కార్యకర్తలపై వేధింపులు.. కేసులకు భయపడం.. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై వేధింపులు ఆపాలి.. లేకపోతే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మా తడఖా చూపిస్తాం' అని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన కదిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై పోలీసుల వేధింపులు ఎక్కువయ్యా యన్నారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. జగనన్న కాలనీల కోసం డంప్ చేసిన చేసిన ఇసుక ఏమైందని ప్రశ్నించారు. క్రిష్టియన్ ఆస్తుల గురించి తమ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపించారు. తమ నాయకుడికి సంబం ధించిన కంకర మిషన్‌పై అధికారులు కక్ష్య సాధింపు చర్యలకు పాల్ప డుతున్నారన్నారు. కార్యకర్తలపై ఎన్నికేసులు పెట్టినా భయపడే ప్రశక్తే లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో కదిరి వైసీపీ కో-ఆర్డినేటర్ మగ్బుల్ బాషా, వైసీపీ నాయకులు పూల శ్రీనివాసరెడ్డి, అత్తార్ చాంద్‌బాషా, వజ్ర భాస్కర్‌రెడ్డి, ఇస్మాయిల్, లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటివైద్య శిబిరం

కొత్తచెరువు: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం బెంగుళూర్‌కు చెందిన శంకర నేత్రాలయ ఆస్ప త్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఇందులో 147 మంది శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారని డాక్టర్ ఆసిత, శివప్రకాశ్, శంకర్ తెలిపారు. శిబిరాన్ని మెడికల్ స్టోర్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఏమిటీ ద్వంద్వ వైఖరి?

- వేధింపులకు భయపడం అంటారు.. మళ్లీ ఆపాలి అంటారు..
- అధికారంలోకి వస్తే వేధిస్తామని మళ్లీ హెచ్చరికలేంటి..!
- బాధ్యతగా వ్యవహరించండి
- వైసీపీ జిల్లా అధ్యక్షురాలికి ఎమ్మెల్యే కందికుంట హితవు



కదిరి, నవంబరు10(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా కార్యకర్తలు వేధించకూడదని ఒక పక్క చెబుతారు... అదే సమయంలో మీ పార్టీ అధికారంలోకి వస్తే వేధింపులు తప్పవని టీడీపీ నాయకులను హెచ్చరిస్తారు... వేధింపులకు, కేసులకు భయపడం అంటారు.. మళ్లీ ఆపాలి అంటారు.. ఈ ద్వంద్వ వైఖరి కనీసం మీకు అయినా అర్థం అవుతున్నాయా.. అని వైసీపీ సత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ఆర్అండ్ బీ బంగ్లాలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు వైసీపీని ఇంత ఘోరంగా తిరస్కరించిన తర్వాత అయినా.. కనీసం బాధ్యత గల ప్రతిపక్షంగా ఉండాలని ఆయన కోరారు. కదిరిలో వైసీపీలో ఒకరు వడ్డీ వ్యాపారి, మరొకరు రూ. 5 కోట్లకు అమ్ముడుపోయిన వ్యక్తి, మరొకరు ఓడిపోయి ఆరు నెలలు అయిన నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని వ్యక్తి .. ఇలాంటి వారిని పెట్టుకొని... తమ ప్రభుత్వం గురించి, ఎమ్మెల్యే పని తీరు గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇసుక, మట్టి గురించి వైసీపీ వారు మాట్లాడటం.. విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చర్చి ఆస్తుల కేసులో ఫిర్యాదు చేసింది వైసీపీ కార్యకర్తేనని, అది కూడా ఆ అధినాయకుడి నియోజకవర్గానికి చెందిన వ్యక్తేనని గుర్తు చేశారు. దొంగ పనులు చేస్తూ వైసీపీ నాయకులు పట్టుబడితే అధికారులు జరిమానా విధించారని చెప్పారు. ఎటువంటి అక్రమాలు జరగలేదని గ్రీన్ ట్రిబ్యూనల్‌కు ఎందుకు ఆ నాయకులు పోలేకపోయారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ నాయకులు చేసిన భూకబ్జాలు, అక్రమాలు వెలికి తీస్తున్నామని, అక్రమాలు ఏపార్టీ వారు చేసినా ఉపేక్షించేది లేదని చెప్పారు. ఇప్పటికే నలుగురు టీడీపీ నాయకుల ఆస్తులు ప్రభుత్వానికి అప్పగించామని చెప్పారు. ఇసుకపై వైసీపీ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి బహిరంగా చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్‌పీకుంట ఇసుక వరకు అన్ని మాట్లాడితే ప్రజలకు అన్ని విషయాలు తెలుస్తాయని అన్నారు. ఇప్పటికే రెండు నియోజకవర్గాలు మారారని, మరో నియోజకవర్గం మారకుండా చూసుకోవాలని ఉషశ్రీకి సూచించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ రంగారెడ్డి, టీడీపీ నాయకులు కొమ్మినేని గంగయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్..

చెరువులో పడి బాలుడి మృతి

ధర్మవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధర్మవరం మొదటి మరువ వద్ద చెరువులో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి మరణించాడు. స్థానిక పల్లవి థియేటర్ సమీపంలో నివాసముంటున్న ఫయాజ్, యాస్మిన్ ఏకైక కుమారుడు లుక్మాన్ (17). తన స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడ్డాడు. తోటి స్నేహితులు వెంటనే ఆ బాలుడి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఆ చెరువు వద్దకువెళ్లి గాలించారు. ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని లైట్లు వేసుకొని.. గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు రాత్రి 8.30 సమ యంలో ఆ బాలుడి మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

కదిరి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు పటాన్ ముజాహిద్దిన్‌ను ఆదివారం అరెస్ట్ చేసిన ట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గంజా యి అక్రమ రవాణా, విక్రయ కేసులో అతనిపై జూలై 11న కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న అతని కోసం గాలించామని తెలి పారు. ఆదివారం కదిరి - పులివెందుల రహదారిలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో ఉన్న అతన్ని అరెస్టు చేశామన్నారు. అతన్ని న్యాయమూర్తి ముందు హాజరు పరచి.. రిమాండ్‌కు పంపామన్నారు. ఇతనిపై ఇప్పటికే హత్య, కర్ణాటక మద్యం, గంజాయి రవాణా కేసులు ఉన్నామన్నారు.

జూదరుల అరెస్ట్

తాడిమర్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తురకవారిపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ కృష్ణవేణి తెలిపారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.27,620ను స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

● బత్తలపల్లి: మండలంలోని ముస్టురు గ్రామ సమీపంలోని ఆదివారం కోడి పందేల స్థావరంపై ఎస్ఐ సోమశేఖర్ తన సిబందితో దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 5,670 ను, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ఆలయంలో చోరీకి యత్నం



కాలభైరవస్వామి ఆలయం

ధర్మవరంరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డులో ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో శనివారం అర్ధరాత్రి హుండీలోని డబ్బులను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడానికి విఫలయత్నం చేశారు. ఆ ఆలయం తలుపుల తాళం పగలగొట్టి.. ఆలయంలోని హుండీని బయటకు ఎత్తుకొచ్చారు. ఆ హుండీని తెరవడానికి విఫలయత్నం చేశారు. కాని అది సాధ్యం కాకపోవడంతో దాన్ని అక్కడే వదిలేసి వెళ్లారు. ఆదివారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశానవాటికకు

స్థలం కేటాయించండి



మృతదేహాన్ని పూడ్చడానికి తీసిన గుంతలో ఊరుతున్న నీరు

కొత్తచెరువు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొత్తచెరువులో శ్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. సమీప బుక్క పట్నం చెరువులో దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం కమ్మ పాళ్యంకు చెందిన ఓ వ్యక్తి మరణించగా.. మృతదేహాన్ని పూడ్చడా నికి గొయ్యితీస్తే నీరు ఊరుతుండటంతో ఇబ్బందులు పడ్డారు. చివరికి బకెట్లతో నీటిని తోడేసి దహన సంస్కారాలు పూర్తి చేశారు. కాగా, దాదాపు 15 వేల జనాభా ఉన్న పంచాయతీకి శ్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు మార్లు రాజకీయ నాయకులకు, అధికారులకు శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని పలుమార్లు తెలిపినా వారు పట్టించుకోలే దని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రేపటి నుంచి ప్రజాఫిర్యాదుల పరిష్కార సభలు

ధర్మవరంరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12 నుంచి 29వ తేదీ వరకు గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పీఎల్ సురేష్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 12న దర్శినమల, 13న నేలకోట, 14న మల్లాకాల్వ, 15న ఏలుకుంట్ల, బుడ్డారెడ్డిపల్లి, 19న రావులచెరువు, 20న తుమ్మల, సుబ్బరావుపేట, 21న పోతులనాగేపల్లి, 22న గొట్లూరు, 26న చిగిచెర్ల, 27న రేగాటిపల్లి, 28న కుణుతూరు, 29న ధర్మవరంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

డిసెంబరు 15లోగా ప్రీమియం చెల్లించాలి

పెనుకొండ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టమోటా సాగుచేసే రైతులకు కూటమి ప్రభుత్వం బీమా పథకం అమలు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని హార్టికల్చర్ అధికారి రాంప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం టమోటా పంటను ఇఫ్ టోకియో అనే కంపెనీకి ఎకరాకు రూ.32వేలు వంతున బీమా చేశారన్నారు. దీనికిగాను ఎకరాకు రూ.3200దాకా బీమా ప్రీమియం వసూలుచేస్తారన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.800, రైతు వాటా కింద రూ.1600 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పథకంలో చేరడానికి రైతులు బ్యాంక్‌లో రుణసదుపాయం పొందితే బ్యాంక్ ద్వారానే ఇన్సురెన్స్ వర్తిస్తుందన్నారు. బ్యాంక్‌లో రుణాలు తీసుకోని రైతులు డిసెంబర్ 15లోపు సీఎస్‌సీ బ్యాంకుల ద్వారా ఎన్‌జీఐపి వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని రబీలో టమోటాసాగుచేసే రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గుండెపోటుతో సీపీఐ నాయకుడి మృతి


గంగన్నకు నివాళులర్పిస్తున్న నాయకులు

లేపాక్షి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుండె పోటుతో సీపీఐ నాయకుడు గంగన్న(57) ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు సీపీఐ మండల కార్యదర్శి శివప్ప తెలిపారు. ఆయన సీపీఐలో ఎంతో కీలకంగా చురుగ్గా వ్యవహరించేవాడని అన్నారు. పేదల పక్షాన నిలబడి భూపోరాటంలో అలుపెరుగని పోరాటం చేశాడన్నారు. మండల కేంద్రంలోని వివేకానంద జిల్లాపరిషత్ పాఠశాలవద్ద ఐదుకళ్ళ సదాశివనగర్ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించాడన్నారు. అలాంటి వ్యక్తి ఈరోజు మనమధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆయన మృతదేహాన్ని పలువురు నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు.

కరాటేలో పురం విద్యార్థుల ప్రతిభ



కరాటేలో పతకాలు పొందిన విద్యార్థులు

హిందూపురం అర్బన్, నవంబరు 10,(ఆంధ్రజ్యోతి): కరాటే పోటీల్లో పురం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కర్నాటక రాష్ట్రం చిక్కబళాపురం జిల్లా గౌరిబిదనూరులో ఆదివారం జరిగిన అంతర్‌రాష్ట్ర కరాటే పోటీల్లో పురం ఎల్ఆర్‌జి పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కరాటే మాస్టర్ రఫిక్ పేర్కొన్నాడు. పోటీల్లో ఇద్దరు విద్యార్థులకు బంగారు పతకాలు రాగా, నలుగురికి రజిత పతకాలు దక్కాయన్నారు. విజేతలను మాస్టర్‌తో పాటు శిక్షకులు రియాజ్‌భాష, జనార్దన్‌రెడ్డి అభినందించారు. అదే విధంగా రైఫిల్ షూటింగ్‌లో సూర్య ప్రథమ స్థానంలో, అజని, మనోజ్ఞలు తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



పెనుకొండ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న తనుశ్రీ రాష్ట్రస్థాయిలో బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. అక్టోబర్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలబాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించగా, ఆ బాలిక రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ దివాకర్ యాదవ్ తెలిపారు.

ముగిసిన ఓటరు నమోదు కార్యక్రమం

లేపాక్షి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో శని, ఆదివారాలు 40 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా నమోదు కోసం 24, మార్పులు చేర్పుల కోసం 12, తొలగింపునకు 8 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మైనార్టీ నాయకులు

పెనుకొండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పదవుల్లో మైనార్టీ నాయకులకు అధిక ప్రాధాన్యత కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం టీడీపీ మైనార్టీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ పాలనలోనే మైనార్టీ నాయకులకు గుర్తింపు వచ్చిందని, ఇందుకు వారికి కేటాయించిన పదవులే నిదర్శనమన్నారు. రాష్ట్ర మైనార్టీ అడ్వైజర్‌గా మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ షరీఫ్‌ను, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను కేటాయించారన్నారు. కార్యక్రమంలో దాదు, నిస్సార్, అమానుల్లా, మహ్మద్, నిస్సార్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి


వాల్మీకి జయంతికి హాజరైన నాయకులు

హిందూపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజానికి వాల్మీకి మహర్షి ఆదర్శ ప్రాయుడని ఆయన బాటలో మనమంతా పయనిద్దామంటూ టీడీపీ, వాల్మీకి నాయకులు పేర్కొన్నారు. ఆదివారం వీవర్స్‌కాలనీలో వాల్మీకి జయంతిని పురస్కరించుకుని జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, మాజీ సర్పంచ్ హెచ్ఎన్ రాము, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప, వెంకటరమణప్ప పాల్గొన్నారు.

అగళిలో అందరూ ఇన్‌చార్జిలే!

రెగ్యులర్ అధికారులులేక జనం అగచాట్లు




ఖాళీగా దర్శనమిస్తున్న ఏఓ కుర్చీ

తహసీల్దార్ లేక ఇబ్బందులు పడుతున్నాం


లక్ష్మీకాంత్, నరసాంబుది

తహసీల్దార్ బదిలీ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు తహసీల్దార్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రెవెన్యూ సంబంధించి పనులకోసం కార్యాలయానికి వెళ్తే తహసీల్దార్ లేకపోవడంతో పనులు జరగడంలేదు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌తోనే పనులు చేయించుకోవాల్సి వస్తోంది. రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి.లాగే పశువులకు రోగం వస్తే పట్టించుకొనే నాథుడే లేకుండా పోయారు.

అగళి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగళిలో అన్నింటికి ఇన్‌చార్జి ఉద్యోగులే గతి అని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చిన తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఎన్నికల అనంతరం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి బాధ్యతలను డీటీ సుబ్బారావుకు అప్పగించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ, కంప్యూటర్ ఆపరేటర్, మండల ఇంజనీర్, టైపిస్ట్, ముగ్గురు అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న శ్రీనివాసరావు రెండు నెలలక్రితం బదిలీపై మడకశిరకు వెళ్లారు. అతని స్థానంలో ఎవరినీ ఇంతవరకూ నియమించలేదు. పశువైద్యాధికారి మహేశ్వరి మూడు ఏళ్ల క్రితం బదిలీపై కర్నూలుకు వెళ్లారు. ఇప్పటివరకూ మరో డాక్టర్‌ను ఇక్కడ నియమించలేదు. ఏంఈఓగా పనిచేస్తున్నగోపాల్ బదిలీపై గోరంట్లకు వెళ్లారు. విద్యుత్ ఏఈ శ్రీనివాసచౌదరి అనారోగ్యంతో రెండు సంవత్సరాల క్రితం మృతి చెందారు. వీరి స్థానంలో కూడా కొత్తవారిని ఎవరినీ నియమించలేదు. ఇనగలూరు హళ్లికెర పంచాయతీలలో జూనియర్ అసిస్టెంట్, వీఆర్‌ఓలు, ఎంఆర్సీ కార్యాలయంలో ఏంఈఓ, హౌసింగ్ ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, ఇరిగేషన్ ఏఈ, విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోస్టులన్నీ ఇన్‌చార్జిలే నిర్వహిస్తున్నారు. ఇన్‌చార్జి అధికారులు ఎప్పుడొస్తారో ఎప్పుడు పోతారో ఎవరికి తెలియదు. మండల స్థాయిలో ఈ విధంగా ఉంటే పరిపాలన ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇన్‌చార్జి అధికారులతో వేగలేక ప్రజలు సతమతం అవుతున్నా మండలాధ్యక్షులు కాని, ఎమ్మెల్యేగాని చొరవతీసుకుని బదిలీపై వెళ్లిన వారి స్థానంలో కొత్తవారిని నియమించేలా చర్యలు తీసుకోవడంలేదు. ఎన్నిరోజులైనా ఇన్‌చార్జి అధికారులతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఎందుకిలా చేస్తున్నారో ఉన్నతాధికారులకు తెలియకపోవడం బాధాకరం. ఇకనైనా ఉన్నాతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అగళి మండలంలో రెగ్యులర్ ఉద్యోగులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వాల్మీకితోనే రామనామ ప్రచారం

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ


వాల్మీకి మహర్షిని పూజిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

చిలమత్తూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తముడైన శ్రీరామచంద్రుని నామాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం నిర్వహించిన వాల్మీకి జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ హిందువుల ఆరాధ్యదైవం శ్రీరామచంద్రుని చరిత్రను వాల్మీకి మహర్షి ప్రపంచానికి తెలిసేలా చేశారన్నారు. అందుకే రామనామం ఎక్కడ ఉంటుందో అక్కడే వాల్మీకి నామం కూడా ఉంటుందన్నారు. వాల్మీకి మహర్షి యావత్తు హిందువులందరు పూజించదగ్గ మహనీయుడన్నారు. ఆయన సమాజానికి మార్గదర్శిగా నిలిచారన్నారు. ఎక్కడైతే వాల్మీకి మహర్షి పూజలందుకుంటారో అక్కడ సిరిసంపదలు విరాజిల్లుతాయన్నారు.

వాల్మీకి మహర్షి విశిష్టతను పెంచేలా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వాల్మీకి జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. వాల్మీకుల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో ఉన్నారన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీపురం కోలాహలంగా మారింది. గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, మండల కన్వీనర్ రంగారెడ్డి, దేమకేతేపల్లి అంజినప్ప, నాగేంద్ర, నరేంద్ర, ప్రవీణ్‌కుమార్, చరణ్, మీసేవ సూరి, అంజి, శీన, నాగరాజు, ముద్దన్న, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయానికి అంబికా విరాళం

హిందూపురం(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మాణం కోసం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ.2,01,116 విరాళం అందజేశారు. ఆదివారం ఎంపీ నివాసానికి వెళ్లిన ఆలయ కమిటీ సభ్యులకు ఈ విరాళం మొత్తం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జేఈ వెంకటస్వామి, రాఘవేంద్ర, చంద్రమోహన్, అమర్నాథ్, సూరీ, రాము, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి దారేది?



ఆశ్రమానికి దారి చూపించాలని కోరుతున్న వృద్ధులు

మడకశిర రూరల్, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలో చత్రం పంచాయితీలో ఉన్న తులసీదామ వృద్ధాశ్రమానికి దారి లేక వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నాట్లు, ఆశ్రమ వ్యవస్థాపకులు తిమ్మప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం వృద్ధాశ్రమానికి వెళ్లడానికి దారి కోసం అప్పట్లో నారాయణప్ప అనే రైతు 25 అడుగుల దారిని వదిలాడని, ప్రస్తుతం వారి కొడుకులు ఆ దారిని మూసివేసినట్లు తెలిపారు. దీంతో ఆశ్రమానికి,ఆలయానికి వెళ్ళడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు తగుచర్యలు తీసుకొని ఆశ్రమానికి ,ఆలయానికి దారిచూపించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మడకశిర రూరల్, నవంబరు10 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని కల్లుమర్రి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ విశ్వనాథ్ తెలిపారు. కావున విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.

విద్యతోనే అభివృద్ధి


ప్రతిభా పురస్కారంతో రఘువీరారెడ్డిని సన్మానిస్తున్న యాదవులు

పావగడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మనిషి ప్రపంచంలో ఎక్కడ రాణించాలన్నా విద్య అనేది ప్రముఖ అస్త్రం అని,, దానిని సరైన సమయంలో సద్వినియోగం చేసుకొంటే ఉన్నత శిఖరాలకు చేరుకోగలమని ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షులు, సీడబ్ల్యూసీ సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి తెలియజేశారు. ఆదివారం పావగడలోని ఎస్ఎస్‌కే సముదాయ భవనంలో యాదవ విద్యార్థులకు ఏర్పాటుచేసిన ప్రతిభా పురస్కారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో అధిక మార్కులు పొందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈసందర్భంగా యాదవ కులస్తులు రఘువీరారెడ్డిని కూడా ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో వణకల్లు మఠాధీశ్వరులు బసవరమానందస్వామి, పావగడ సర్వధర్మ శాంతి పీఠం అధ్యక్షులు రాంమూర్తి స్వామిజీ, బెంగుళూరు ఎస్ఐ చంద్రశేఖర్, యాదవ సంఘం అధ్యక్షులు నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగులకు వాహనాల పంపిణీ

పావగడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గురుభవన్ ఆవరణంలో శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దివ్యాంగులకు ఎలెక్ట్రికల్ వాహనాలను పంపిణీ చేయనున్నట్లు సీడీపీఓ సునీత తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు తాలూకా పంచాయతీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసే ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. అర్హులైన లబ్ధిదారులకు వాహనాలను పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలియజేశారు.

పాల ఉత్పత్తిదారుల ఎన్నికల్లో తీవ్ర ఉత్కంఠ

పావగడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుమకూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల సంఘానికి ఆదివారం జరిగిన డైరెక్టర్ ఎన్నికల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, జేడీఎస్ అభ్యర్థి చెన్నమల్లయ్యల మధ్య పోటాపోటీ నెలకొనడంతో డైరెక్టర్‌లకు కావాల్సిన 58 మంది డెలిగేటర్స్ (ఓటర్లు)లలో ఇద్దరికీ చెరో 29 మంది ఓట్లువేశారు. విజయానికి అవసరం అయిన 30 మంది ఓటర్ల కోసం ఇరు పార్టీల అభ్యర్థులు తీవ్రంగా ప్రయత్నం చేసినా ఇద్దరికీ 29 చెరిసగం ఓట్లు వేయడంతో చివరి వరకు ఉత్కంఠ భరితమైన పోరు కొనసాగింది. ఈనెల 26వతేదీన ఫలితాలు వెలువడనున్నాయి. చంద్రశేఖర్‌రెడ్డికి, చెన్నమల్లయ్యకు, ఎమ్మెల్యే హెచ్.వి.వెంకటేష్‌కు ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ ఎన్నికలు వారి రాజకీయ భవిషత్తుపై ఆధారపడి ఉండటంతో గెలుపు ఎవరిది అనే విషయమై చర్చలు సాగుతున్నాయి.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి తీవ్రగాయాలు

రొళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలం భాజయ్యపాళ్యం లోని నాగరాజు అనే రైతు ఆదివారం సాయంత్రం పొలంలో పశువులకు గడ్డికోస్తుండగా అతడిపై ఎలుగుబంటి దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు అతడిని గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స చేయించారు. అక్కడ అతడికి వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం రెఫర్ చేసినట్లు డాక్టర్ సృజన తెలిపారు.

మడకశిరకు 2050 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ

మడకశిర,నవంబరు10(ఆంధ్రజ్యోతి): రబీలో బోరు,బావుల కింద వేరుశనగ పంటసాగు చేసేందుకు వీలుగా ప్రభుత్వం మడకశిర డివిజన్‌కు 2050 క్వింటాళ్ళ సబ్సిడీ వేరుశనగను విత్తనకాయలను కేటాయించిందని వ్యవసాయ శాఖ ఎడి.కృష్ణమీనన్, ఎఓ. తిమ్మప్ప తెలిపారు. రబీలో వేరుశనగ పంట సాగు చేసే రైతులు వేరుశనగ కోసం రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సబ్సిడీ పోను క్వింటాలుకు రైతు రూ.5760లు చెల్లించాలన్నారు. ఆధార్‌కార్డు, కరెంట్‌బిల్లు ఉండాలన్నారు.

ఘనంగా బొమ్మలింగేశ్వర ఆలయంలో హోమాలు

అగళి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అగళి మండలం తొక్కలపల్లి గ్రామంలో బొమ్మలింగేశ్వర స్వామికి ప్రత్యేక హోమాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, వెండి ఆభరణాలతో అలంకరణలు, ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సోమవారం విగ్రహాల పునఃప్రతిష్ఠ, జలధి కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ వారు తెలిపారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

టెక్నికల్ అసిస్టెంట్ రమేష్ మృతి

గుడిబండ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీఎన్ పాళ్యం గ్రామానికి చెందిన ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్(52) మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రమేష్ శెట్టూరు మండలంలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేసేవారు. పనులు ముగించుకుని కేజీఎన్ పాళ్యం గ్రామానికి వచ్చాడు. రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగానే మృతిచెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, ఉపాధి హామీ పీడీ సలీంబాషు, గ్రామానికి వచ్చి రమేష్ మృతదేహంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులు అర్పించారు.

ఓటరు నమోదును పరిశీలించిన తహసీల్దార్

రొళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ షేక్షావలి ఆదివారం పరిశీలించారు. 124, 125, 126 పోలింగ్‌బూత్‌లను సందర్శించారు. ఫారం-6 , ఫారం-7 ఫారం-8లలో ఒకటి కూడా రాలేదని ఆయన తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్

మడకశిరటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మడకశిర పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కొత్తగా ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకులు బాబు తెలిపారు. ఈ కేంద్రంలో ఆధార్ కొత్తగా నమోదు చేసుకోవడం, ఆధార్ అప్‌డేషన్‌తోపాటు కార్డులో ఇతరత్రా తప్పులు సరిచేసుకోవచ్చన్నారు. సోమవారం నుంచి ఈ కేంద్రం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


వైసీపీ వారిని పార్టీలోకి చేర్చుకుంటున్న ఎమ్మెల్యే

మడకశిర రూరల్, నవంబరు10 :(ఆంధ్రజ్యోతి) మండలంలోని కదిరేపల్లి పంచాయితీ కంబాలపల్లి చెందిన వైసీపీవైస్ ఛైర్మన్ గోపాల్ నాయక్ తిప్పేనరసప్పతో పాటు 50 కుటుంబాలు శనివారం టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

నేడు టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

మడకశిరటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలుగుదేశం పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, సీనియర్ నాయకులు రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సిద్దేశ్వరస్వామి

అమరాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి శ్రీ హెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం కార్తీక మాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా స్వామివారికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, తైలాభిషేకం, పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేసి మహా మంగళ హారతిని ఇచ్చి తీర్థప్రసాదం పంచిపెట్టారు. అదే విధంగా స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాల భైరవేశ్వరస్వామి, శ్రీదొడ్డేశ్వరస్వామి, శ్రీమల్లేశ్వరస్వామి, దేవాలయాల్లో కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్ తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా తొలి ఆదివారం స్వామి దర్శనం కోసం ఆలయ ప్రాంగణం శివ నామ స్మరణలతో కిట కిట లాడటం విశేషం.

రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



రొళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలో వెలిసిన కాలువేపల్లిరంగనాథస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో ఆదివారం కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు మొక్కుబడులు తీర్చుకొన్నారు. స్వామివారిని పూలతో అలంకరించి అర్చన నిర్వహించారు.